

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర




వ్యవస్థాపక సంపాదకులు : జి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 27 | సంచిక : 2 | అక్టోబర్ 2021

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి.పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342


## ఈ సంచికలో....


లాల్ బహదూర్ శాస్త్రి .................................................. 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ................ 3


అక్షరమణమాల - ద్విపద 15 ....................................... 24

భగవద్గీత - శ్లోకం 2-46 ............................................ 26


**ఇతర విషయములు :**



చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం

మీరు ఏమి కష్టపడక్కర్లేకుండా, ఏమి శ్రమ పడక్కర్లేకుండా మీకు జ్ఞానం కలగాలి అంటే ఒక చిన్న రహస్యం చెబుతున్నాను. ఈ చిన్న చిట్కా మీరు గుండెల్లో పెట్టుకోండి. ఒకటి అహంకారం లేకుండా జీవించటం, రెండు ప్రేమ పూరితంగా పని చేయటం, ప్రేమ పూరితంగా మాట్లాడటం, ఇవి మూడు మీరు పట్టుకుంటే మీరు అందరూ జ్ఞానులు అయిపోతారు.

# లాల్ బహదూర్ శాస్త్రి



**అక్టోబర్ రెండవ తేదీ మహాత్మా గాంధీ జన్మించిన రోజు. లాల్ బహదూర్ శాస్త్రి కూడా జన్మించిన రోజు. ఇద్దరి జయంతి ఒకే రోజు. లాల్ బహదూర్ శాస్త్రి గారి గురించి నాన్నగారి అమూల్య వాక్కులు.**

లాల్ బహదూర్ శాస్త్రి, మహాత్మా గాంధీ ఇద్దరూ ఒకే రోజున పుట్టారు. ఇద్దరూ మహాత్ములే. అయితే నా దృష్టిలో మహాత్మాగాంధీ కంటే కూడా గొప్పవాడు లాల్ బహదూర్ శాస్త్రి. గాంధీగారి కంటే శాస్త్రి గొప్పవాడు అని ఎందుకు అంటున్నాను అంటే, శాస్త్రిగారు అన్ని ఆకర్షణల మధ్యన ఉన్నాడు. గాంధిగారు ప్రతిదానికీ దూరంగా ఉన్నాడు. ఆయన ఏమీ అంటుకోలేదు, ఎప్పుడూ ఏ పదవులలోకి వెళ్లలేదు. శాస్త్రిగారు అలా కాదు, అన్ని ఆకర్షణల మధ్యా ఉండికూడా ఎక్కడా దేనికీ లోను కాలేదు. గాంధీగారికి పదవి లేదు. మనం దూరంగా ఉండటం మంచిది అని దూరంగానే ఉన్నాడు. శాస్త్రి అన్ని పదవులు చేశాడు. ఎక్కడా మసి లేకుండా మైల పడకుండా బయటికి వచ్చాడు. వాడు లాల్ బహదూర్ శాస్త్రి! గాంధీగారు పదవులకు, డబ్బుకు ఎప్పుడూ దూరంగా ఉన్నాడు. అంటే మనం వాటి జోలికి వెళ్లకూడదు అనుకున్నప్పుడు దూరంగానే ఉన్నాడు. శాస్త్రి గారు అలా కాదు. ఆయన రాజకీయంగా చాలా పదవులు చేసారు. ఇంకా ప్రైమ్ మినిష్టరు చేశాడు. పదవి లేకుండా ఎప్పుడూ లేడు. ఎప్పుడూ ఏమీ ఆశించకుండా చేశాడు. అంటే అన్ని ఆకర్షణలు ఎదురుగా ఉండి కూడా ఎప్పుడూ దేనికీ అట్రాక్ట్ అవ్వలేదు,

శాస్త్రిగారికి మాటలో కానీ జీవితంలో కానీ ఎక్కడా ఆడంబరం లేదు. కాశీ దగ్గరలో మొగల్ సరాయి అని ఒక పెద్ద రైల్వే జంక్షన్ ఉంది. ఆ ఊరు ఆయనది, ఆయన ఎక్కువ కాశీలోనే చదువుకున్నాడు. బహు బీదవాడు, కానీ చదువు అంటే ఇష్టం. అలాగే కష్టపడి చదువుకున్నాడు. ఏదైనా కాలువ ఉంది అనుకోండి మధ్యలో, బల్లకట్టు వాడికి ఇవ్వటానికి డబ్బులు లేకపోతే, కాలువ ఈదుకొని వెళ్ళిపోయేవాడు బల్లకట్టుకి కూడా డబ్బులు ఇవ్వలేని పరిస్థితులలో అంత బీదతనము అనుభవించినా, తరువాత ఎంత డబ్బు వచ్చినా ఎప్పుడూ అట్రాక్ట్ కాలేదు దేనికీ. ఒక్క జీతం తప్పించి ఏమీ తీసుకోలేదు. జీతమైనా ఎందుకంటే పొట్టకోసం.

శాస్త్రిగారికి గాంధీగారికి తేడా ఏమిటంటే, భోగాల జోలికి వెళ్లలేదు గాంధిగారు, శాస్త్రిగారు అన్నీ భోగాల మధ్యన ఉండి, ఎక్కడా వికారం లేకుండా ఉన్నాడు. అంటే ఇంద్రియాలకి సంబంధించిన ఆకర్షణలు ఎన్నో ఉన్నాయి. కానీ ఏ ఆకర్షణకి లోనూ కాకుండా ఉన్నాడు శాస్త్రి గారు. ఆ కోణంలో గాంధీ కంటే గ్రేట్ ఆయన అని నాకు అనిపిస్తుంది.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 23 ఆగష్టు 1984, భీమవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మనసుని ఎప్పుడూ కూడా సదా నిగ్రహించుకోవటం చాలా కష్టం అని ఆచార్యుల వారు చెబుతున్నారు. మనం ఎంతసేపు సబ్జెక్టు అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చెయ్యాలి. అసలు మనస్సుని ఎందుకు నిగ్రహించుకోవాలి? నిగ్రహించుకోకపోతే నష్టం ఏమిటి? సహేతుకంగా ఉండాలి మనం మాట్లాడుకునే మాటలు. Reasonని కూడా మీరు విడిచి పెట్టకూడదు, విశ్వాసం విడిచి పెట్టకూడదు. హేతువాదం గురించి భక్తులు ఎవరు కూడా భయపడవలసిన పని లేదు. ఎందుచేత అంటే సమాధి స్థితి హేతువాదానికి విరుద్ధంగా ఉంటుంది అని నేను అనుకోవటం లేదు. హేతువుకు విరుద్ధంగా ఉంటే అది సమాధి స్థితే కాదు. మీరు బాగా అర్థం చేసుకోండి, reason కి మటుకు విరుద్ధం కాదు సమాధి స్థితి. మనం ఏమి చెయ్యాలి అంటే reason ఎంతవరకు మనకు సహాయం చేస్తుందో అంతవరకు reason కూడా వెళ్ళాలి. ఈ మెటాఫిజిక్స్ లో లాజిక్ కి కూడా స్థానం ఉంది. reason ఎంత సహాయం చేస్తే అంత దూరం మనం వాటి కూడా వెళ్ళాలి. వాటి సహాయం స్వీకరించు కుంటూ, విశ్వాసం కూడా హేతువు కూడా ప్రయాణం చేస్తూ వెళ్ళాలి. అది ఎంతవరకు సహకారం చేస్తే అంతవరకు వెళదాం. అవి రాగల దూరం అవి వస్తాయి. తరువాత విడిచి పెట్టేస్తాయి. అంతమాత్రం చేత ఇవి రెండింటికి మనం పొందే స్థితి విరుద్ధం మటుకు కాదు.

ఆచార్యుల వారు అడిగిన ప్రశ్న ఏమిటి అంటే మనస్సును నిగ్రహించడం మనిషికి చాలా కష్టం. నేను మిమ్మల్ని అడిగే ప్రశ్న ఏమిటి అంటే, అసలు మనస్సును ఎందుకు నిగ్రహించుకోవాలి? మీకు కూడా ఆలోచన ఉంటుంది. మీ ఆలోచనని చంపేయడానికి నేను ఇక్కడకు రాలేదు. జిన్నూరు నుంచి పదహారు మైళ్ళు ఇక్కడకు వచ్చాను, మీ ఆలోచనను చంపేయడానికా నేను ఇక్కడకు వచ్చింది? నాకొక మనస్సు ఉంది. నా మనస్సు నాకు కనిపిస్తోంది. ఎలా కనిపిస్తోంది నాకు? తలంపుల రూపంలో కనిపిస్తోంది. నా శరీరం నాకు కనిపిస్తోంది. మరి రెండూ ఉన్నాయి కదా, ఇంకేమిటి నాకు కొరత? కేవలం ఈ

శరీరమే నిజం అయితే, ఈ మనస్సే నిజం అయితే నాకు అశాంతి ఎందుకు వస్తోంది? నిజం లోంచి అసలు అశాంతి వస్తుందా నిజం లోంచి అశాంతి వస్తే అసలు అది నిజం అవుతుందా? కొంతమంది దేవాలయానికి వెళ్ళి నాకు డబ్బు కావాలి, ఇంకొకటి కావాలి అని బాహ్యమైనటువంటివి అడుగుతారు. కాని సర్వ సాధారణంగా సూక్ష్మ బుద్ధి గలవాడు నాకు మనస్సును నిగ్రహించుకునే శక్తి ఇమ్మని అడుగుతాడు. మనస్సును ఎందుకు నిగ్రహించు కోవడం? మనస్సుని నిగ్రహించుకోకపోతే వీళ్ళకి వచ్చిన ఇబ్బంది ఏమిటి? అది మీరు ఎప్పుడైనా ఆలోచించారా? అంటే నీ మనస్సు నీకు అశాంతి తీసుకు వస్తోంది. నీ మనస్సు నీకు దుఃఖాన్ని తీసుకు వస్తోంది. దుఃఖాన్ని తీసుకొస్తుంది కాబట్టి మనస్సుని నిగ్రహించాలి. మనస్సు లోంచి విడుదల పొందాలి అని చూస్తున్నారు. నిజంగా మీకు మనస్సు అశాంతి తీసుకు రాకపోతే, మీరు నిగ్రహించుకునే సమస్య ఏమిటి అసలు? ఎందుకు నిగ్రహించుకోవాలి దానిని? మనం ఇంటికాడ ఎప్పుడైనా ఒంటరిగా కూర్చున్నప్పుడు శాంతిగా ఉన్నట్టు ఉంటుంది. ఆనందంగా ఉన్నట్టు ఉంటుంది. అది మటుకు నిజం కాదు. ఎందుచేత అంటే నీకు వచ్చిన శాంతి నిజమే కనుక అయితే, నీకు వచ్చిన ఆనందం నిజమైనదే అయితే అది పోవటానికి వీలు లేదు. అబద్ధం పోతుంది కాని నిజం ఎక్కడకు పోతుంది? ఇంటికాడ ఒక ఐదు నిమిషాలో, పది నిమిషాలో, ప్రతీ రెండు రోజులకి ఒకసారి మీరు శాంతిని పొందుతున్నారు. అది నిజమే అనుకుందాం. అది నిజమే అయితే మరుసటి రోజున, మరుసటి గంటలో ఎందుకు ఉండటం లేదు? మీ జీవితంలో లేని అనుభవాన్ని నేను ఏదైనా చెబుతున్నానా? అంటే ఏమిటి, మీ మనస్సులో భోగం అది. అది ఆత్మ శాంతి మటుకు కాదు. ఆత్మకు సంబంధించిన అనుభవం కనుక మీకు నిజంగా కలిగితే అది పోవటానికి వీలు లేదు.

అయితే మీకు ఇంటికాడ వచ్చేది ఏమిటి? మనస్సు అణిగి ఉన్నప్పుడు, తలంపులు యొక్క వేగం తగ్గినప్పుడు, ఆ రజోగుణం యొక్క వేగం తగ్గినప్పుడు మీకు శాంతిగా ఉన్నట్టు ఉంటుంది. అంతేకాని అది నిజం కాదు. అది నిజం అయితే ఎప్పుడూ ఉండాలి. మీకు వచ్చే అనుభవం, మీకు వచ్చే శాంతే గనుక నిజం అయితే 24 గంటలు ఉండవలసిందే. అసలు పోవటానికి వీలు లేదు. ఇవాళ ఉండి రేపు పోయేదాన్ని కష్టపడి ఇవాళ

సంపాదించుకోవాల్సిన పని ఏమిటండి అసలు? మా మనస్సు మమ్మల్ని చాలా ఇబ్బంది పెట్టేస్తోంది, దుఃఖ పెట్టేస్తోంది, నిగ్రహించుకోలేక పోతున్నాం. భగవంతుడి వైపు మనస్సును తిప్పుదాం అన్నా తిరగడం లేదు, ఇలా అంటూ ఉంటారు కదా, అసలు మనస్సు అనేది ఎలా ఉంటుందో మీరు ఎప్పుడైనా చూశారా?

ఒక ఇంజనీరింగ్ చదివే అబ్బాయి ఏమని అడిగాడు అంటే "ఏవండి అహంకారాన్ని ముందు వదిలించుకోవాలి అంట కదా" అని అడిగాడు. అహంకారం నిజంగా ఉందా అని అడిగాను, ఉంది అన్నాడు అతను. నిజంగా ఉంటే ఎవడూ వదిలించలేడు. భగవంతుడు వదిలించలేడు. నిజాన్ని భగవంతుడు ఎలా తియ్యగలడు అసలు? మెటాఫిజిక్స్ లో ఉన్న మాటలు చూసి మీరు ఏమి గాబరా పడకండి. అహంకారం అన్నా, మనస్సు అన్నా, జీవుడు అన్నా అన్నీ ఒక్కటే! ఒకే వస్తువు, ఒకే తత్త్వం, మీరు దానికి ఈ పేర్లన్నీ పెట్టుకోవచ్చు. ఆచార్యులు వారు చెప్పేది ఏమిటి, దానిని నిగ్రహించుకోవడం కష్టం అని. పోనీ నిగ్రహించవద్దు. అది ఎలా ఉంటుందో మీరు చూడండి ముందు. గాలి వానలు వస్తున్నాయి. పెద్ద వర్షాలు కురిసేస్తాయి. లేకపోతే యుద్ధం వచ్చి బాంబులు వేసేస్తారు. ఈ బాంబులు వేసిన దానికంటే, గాలివానలు వచ్చిన దానికంటే, ప్రకృతి వైపరీత్యాలుకంటే మానవులు ఎక్కువ బాధపడేది వాళ్ళ మనస్సు నుండే బాధ పడుతున్నారు. ఇది మీరు ఆలోచించండి. ఆ దుఃఖం తోటి పోల్చుకుంటే తన మనస్సు పెట్టే దుఃఖం ఎక్కువ అసలు. మీ ఆర్థిక పరిస్థితులు మీకు తీసుకు వచ్చే దుఃఖం కంటే, భూకంపాలు తీసుకు వచ్చే దుఃఖం కంటే, ఈ ప్రకృతి తీసుకొచ్చే దుఃఖం కంటే తన మనస్సు ద్వారానే తను ఎక్కువ దుఃఖ పడుతున్నాడు. అందుకే ఆచార్యుల వారు మనస్సును నిగ్రహించుకోమంటున్నారు.

మీకు ఏదైనా ఒక తలంపు వస్తే మీకు మనస్సు కనిపిస్తుందా? తలంపు రాకుండానే

**మనకి ఏది మంచిదో మనకంటే గురువుకి బాగా తెలుసు. అందువలన మనము భగవంతుడు దగ్గరకు వెళ్ళినా, గురువు దగ్గరకు వెళ్ళినా ఆయన దయ, అనుగ్రహం తప్పించి ఇంకేమీ కోరుకోవద్దు.**



మనస్సు కనిపిస్తుందా? మీ మనస్సుని మీరు చూడలేరు, నాకు చూపించలేరు. అయితే అది మిమ్మల్ని దుఃఖ పెడుతోంది అబద్ధమా, నిజమా అంటే దుఃఖ పెడుతోంది. లేకపోతే ఇంత దుఃఖం ఎందుకు? ప్రపంచం అంతా దుఃఖ మయమే కదా, మరి దుఃఖం కనిపిస్తోంది కదా, ఈ దుఃఖం ఎక్కడి నుంచి వస్తోంది? లోపల నుంచి వస్తోందా? బయటి నుంచి వస్తోందా? ఈ తలంపు మీ లోపల నుంచి వస్తోందా? బయటి నుంచి వస్తోందా? లోపల నుంచే వస్తోంది. లోపల నుంచి వస్తుంది అని మీరు అందరూ అంగీకరిస్తారా లేకపోతే ఇందులో ఏమైనా పేచీలు ఉన్నాయా? తలంపు అనేది ప్రతీ మనిషికి వస్తుంది. అది లోపల నుంచి వస్తోందా? బయటి నుంచి వస్తోందా? లోపల నుంచే వస్తుంది. అయితే ఇది ఎక్కడ నుంచి వస్తుంది? లోపల నుంచి వస్తుంది అంటే మనలో ఎక్కడ నుంచో వస్తుంది అన్నమాట, అది ఎక్కడ నుంచి వస్తుందో మీరు ఎప్పుడైనా చూడండి. ఆ తలంపు ఎక్కడ నుంచి వస్తుందో మీరు గనుక చూడగలిగితే మీకు నిగ్రహించుకోవడానికి అసలు మనస్సు లేదు. మనస్సు ఉంటే నిగ్రహించుకునే సమస్య వస్తుంది, అది లేనప్పుడు మీరు ఎలా నిగ్రహిస్తారు? ఏముంది నిగ్రహించుకోవడానికి అసలు? ఈ చిన్న పని చెయ్యడానికి ఇంటికాడ నుండి అరణ్యానికి వెళ్ళిపోవాలా మీరు? హిమాలయ పర్వతాలకి వెళ్ళిపోవాలా ఈ పని చెయ్యడానికి? మీ ఇంటికాడచెయ్యలేరా?

విష్ణుసహస్రనామాలు చదవచ్చు, రామాయణం చదవచ్చు, భగవద్గీత చదవచ్చు. దేని కోసం చదువుతున్నాం? పూజ చెయ్యచ్చు, జపం చెయ్యచ్చు, దేనికోసం చేస్తున్నాం ఇవన్నీ! రమణస్వామిని ఏమని ప్రశ్న అడిగారు అంటే అన్నీ తలంపులే అంటున్నారు కదా, అన్నీ కోరికలే అంటున్నారు కదా, మిమ్మల్ని నేను చూడటానికి వచ్చాను, మరి ఇది కోరికే కదా అన్నారు. అప్పుడు భగవాన్ ఏమన్నారు అంటే నువ్వు చెప్పింది రైటే, ఇది కోరికే! నువ్వు కోరిక లేకుండా రాలేదు కదా, నువ్వు పోగొట్టుకోవాల్సిన తలంపులు చాలా ఉన్నాయి. నువ్వు పోగొట్టుకోవాల్సిన కోరికలు చాలా ఉన్నాయి. చాలా ఉండగా నన్ను చూడటానికి రావటం అనేది ఒక్కటే నీకు కోరికగా కనిపిస్తుందా? ఇది ఒక్కటేనా? భగవాన్ నేను ఎవడనులో ఒకటి చెప్పారు శవాన్ని కట్టెలు కాలుస్తాయి. శవాన్ని కాల్చేసి అవి ఉండవు, శవాన్ని పూర్తిగా కాల్చేసి కట్టెలు కూడా కాలిపోతాయి. అదే విధంగా ఈ నేను ఎవడను అనే ప్రశ్న కూడా తలంపు ఎవరికి వస్తుంది? ఎవరికి వస్తుంది? ఇలాగ ప్రశ్న వేసుకుంటూ ఉంటే, మిగతా

తలంపుల్ని కాల్చేసి ఈ తలంపు కూడా కాలిపోతుంది.

ఏదో ఒక నామాన్ని తీసుకుంటారు అనుకోండి, రామ నామమో, కృష్ణ నామమో, ఏదో శివ నామమో, ఏదో ఒకటి తీసుకుని దానిమీదే విశ్వాసం పెట్టుకుంటారు. ఆ నామాన్ని నిరంతరం చేస్తూ ఉంటారు. ఆ నామాన్ని నిరంతరం చెయ్యగా, చెయ్యగా, మీకున్న ప్రకృతికి సంబంధించిన తలంపులు లోపల నుంచి వస్తున్నాయి కదా, ఆ తలంపుల్ని కాల్చేసి ఆఖరున ఇది కూడా కాలిపోతుంది. ఆ తలంపుల తోటి మీకు ఈశ్వరుడు మీద ఉన్న భక్తి కూడా ఆఖరున పడిపోతుంది. ఏ తలంపులు అయితే మీకు దుఃఖాన్ని తీసుకువస్తున్నాయో, ఆ తలంపులను అన్నింటినీ కాల్చేసి ఆఖరున ఇది కూడా కాలిపోతుంది. ఎందుచేత కాలిపోతుంది? అది కూడా తలంపే కాబట్టి! మీరు ప్రార్థన చేసుకోవడం కూడా తలంపే, విష్ణుసహస్రనామాలు చదవడం కూడా తలంపే, పూజ చేసుకోవడం కూడా తలంపే! అయితే విడిచి పెట్టకూడదు. ఎందుచేత? లోపల మనలను బంధించే తలంపులను నాశనం చెయ్యటం కోసం ఇవి ఏర్పాటు చేశారు. అసలు సత్పురుషుడు అంటే ఎవరు? ఎవడైతే తనలో ఉన్న సత్యవస్తువును దర్శించాడో వాడే సత్పురుషుడు. భగవాన్ ఆహార నియమం చెప్పారు, ప్రాణాయామం చెప్పారు, సత్సంగం చెప్పారు, అతిగా నిద్రపోవద్దు అన్నారు, అతిగా తిండి తినద్దు అన్నారు. నిద్ర విషయంలో జాగ్రత్తగా ఉండాలి, తిండి విషయంలో జాగ్రత్తగా ఉండాలి, చేసే స్నేహాలు విషయంలో జాగ్రత్తగా ఉండాలి అని చెప్పారు.

మనస్సును నిగ్రహించడం అంటే అన్ని విషయాల్లోనూ జాగ్రత్తగా ఉన్నవాడు మనస్సును నిగ్రహించగలడు లేకపోతే నిగ్రహించలేడు. ప్రకృతిని జయించాలి అంటారు, ప్రకృతిని జయించడం అంటే పంచభూతాలను జయించడమనా? ప్రకృతి అంటే ఏమిటి? మీరు ఏమి అర్థం చేసుకుంటున్నారు ప్రకృతిని జయించడం అంటే? మన మనస్సే ప్రకృతి. ఈ మనస్సుని జయించిన వాడు జ్ఞాని అవుతాడు. ప్రకృతిని దాటడం అంటే మన మనసుని దాటడమే ప్రకృతిని దాటడం. ఎవడైతే తన మనసుని దాటి వెళ్ళాడో వాడు జ్ఞాని అవుతాడు. శాంతి సముద్రం మన లోపల ఉంది. అది మనకోసం కనిపెట్టుకుని ఉంది ఎప్పుడెప్పుడు వీడికి అనుభవం ఇవ్వాలా అని, కాని మన మనస్సు అడ్డు వస్తోంది. ఎవరి మనస్సు? నా మనస్సు నాకే అడ్డు వస్తోంది. అందుకే జయించమంటున్నారు ఆచార్యుల వారు. ఇవన్నీ

భగవాన్ చెప్పారు, శాస్త్రాలు చెప్పాయి, పురాణాలు చెప్పాయి, కాని మనకు శ్రద్ధ ఉండాలి కదా. మనస్సు నిగ్రహించుకోవటానికి ఎవరైనా ప్రయత్నం చేస్తున్నారా? మనం కీర్తి సంపాదించుకోవడానికో, ధనం సంపాదించుకోవడానికో, లేకపోతే చదువులు చదువుకోవటానికి కాలాన్ని ఖర్చు పెడుతున్నాం కాని మనస్సు నిగ్రహించుకోవడం కోసం ఇప్పటివరకు ఎంతకాలం ఖర్చు పెట్టాం? ఇప్పుడు మనకి యాభై సంవత్సరాలు, అరవై సంవత్సరాలు ఉంటుంది వయసు. ఈ అరవై సంవత్సరాల కాలంలో మనం విద్య, కీర్తి, డబ్బు, అధికారం ఇలా కాల గర్భంలో కలిసిపోయేవి సంపాదిస్తున్నాం కాని, నిజంగా మనసు నిగ్రహించడం కోసం మన జీవితంలో ఎంతకాలం ఖర్చు పెట్టాం? మీరు గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పండి. నిగ్రహించుకోవాలి అని తలంపు ఎందుకు వస్తోంది? మీరు బాగా ఆలోచించండి. మనస్సు మీరు కాదు కాబట్టి దానిని నిగ్రహించుకోమంటున్నారు. నిజంగా మీరు మనస్సు అనుకోండి, నిజంగా అది అయినప్పుడు దానిని నిగ్రహించుకునే సమస్య ఏముంది అసలు? శరీరానికి యాభై సంవత్సరాలు, నలభై సంవత్సరాలు వయస్సు. ఆత్మకి వయసు ఉందా అసలు? ఆత్మకు వయసు ఏముంది? ఎప్పుడు ఉండే దానికి అసలు వయసు ఏమిటి?

భగవంతుడు ఏమిచెబుతున్నాడు? ఉన్నది ఒక్కటే వస్తువు అంటున్నాడు. ఆత్మ ఉందని చెప్పలేదు భగవంతుడు గీతలో. ఆత్మ ఒక్కటే ఉందని చెప్పాడు. ఆత్మ ఒక్కటే ఉంది అంటే మిగిలినవి అన్నీ అబద్ధాలు అనితెలుస్తున్నాయి కదా, శరీరం, మనస్సు కూడా అబద్ధాలు అనితెలుస్తున్నాయి కదా! నిజమైన వస్తువు ఒకటిగా ఉంటుందా? రెండుగా ఉంటుందా? నేను చెప్పింది నిజమే, మీరు చెప్పింది నిజమే, వారు చెప్పింది నిజమే అవుతాయా? నిజం అనేది ఒకటిగా ఉంటుందా? లేక నాలుగుగా ఉంటుందా? మూడుగా ఉంటుందా? ఓట్లు సంపాదించే ఎలక్షనా ఇది? మీ అందరి ఓట్లు వేయించుకోవడానికి, మీరందరూ చెప్పింది నిజం అనటానికి, నిజం అనేది ఎలా ఉంటుంది అసలు? మీరు మనసులో అనుకునేది మటుకు నిజం కాదు. మనస్సును నిగ్రహించడం చాలా కష్టంగా ఉంది స్వామి అని అర్జునుడు అడిగితే, అవ్వడానికి కష్టమే కాని నిగ్రహించవచ్చును. ఎలా అంటే అభ్యాసం వల్ల, వైరాగ్యం వల్ల నిగ్రహించవచ్చును అని భగవంతుడు చెప్పాడు. గాలిని పట్టుకోవడం ఎంత కష్టమో, మనసుని నిగ్రహించు కోవడం అంతే కష్టం. కాని నిగ్రహించవచ్చు. అభ్యాసం

వల్ల, వైరాగ్యం వల్ల, నిగ్రహించవచ్చు అని భగవంతుడు గీతలో చెప్పాడు. మనలో ఎవరైనా వైరాగ్యం ఉన్నవాళ్ళు ఉన్నారా? నిజంగా మనకి వైరాగ్యం ఉంటే అసలు మనస్సు ఎందుకు కదులుతోంది? మనస్సు కదులుతుంటే మనకి వైరాగ్యం లేదు అని అర్ధం, నిజంగా మనకి వైరాగ్యం ఉంది అనుకోండి అప్పుడు మనస్సు చలించదు కదా, వైరాగ్యం లేకే మనసు చలిస్తోంది. నిజంగా వైరాగ్యం ఉంటే మనసు కంట్రోల్ చెయ్యవలసిన సమస్య ఏమిటసలు? మనసు అటు ఇటు కదులుతుంటే దానిని నిగ్రహించాలి. మనస్సుకు చలనం లేదు అనుకోండి, నిగ్రహించుకునే సమస్య ఏమిటి? వైరాగ్యం ఉంటే అసలు మనసు కదలనే కదలదు. ఎవరిని నిగ్రహిస్తారు మీరు? మనస్సు చలిస్తుంటే నిగ్రహించుకోవటం, అసలు రోగమే లేని వాడికి మందు ఎందుకు? వైరాగ్యంతో మనస్సును జయించవచ్చు. వైరాగ్యం అంటే తక్కువ స్థాయిలో చూడవద్దు. వైరాగ్యం జ్ఞానంతోటి సమానము అన్నారు.

మనసుని నిగ్రహించుకోవడం కోసం మీరు ఎంతకాలం యోగాభ్యాసం చేశారు? అని భగవాన్‌ను అడిగారు. నాకు వియోగం ఉంటే యోగాభ్యాసం చేస్తాను. నాకు వియోగం ఎప్పుడు ఉంది యోగాభ్యాసం చెయ్యడానికి? విభక్తి ఉన్నవాడికి భక్తి కాని, విభక్తి లేనివాడికి భక్తి ఏమిటి? వియోగం ఉన్నవాడికి యోగం, విభక్తి ఉన్నవాడికి భక్తి, నాకు విభక్తి లేదు అందుచేత భక్తి అక్కర్లేదు. నాకు వియోగం లేదు, అందుచేత యోగం అక్కర్లేదు. నాకు నిగ్రహించుకోవడానికి మనస్సు అంటూ లేదు. నీ మనస్సేమో ఒకచోట పడి ఉండమంటే ఉండటం లేదు. నా మనస్సుని కదలమంటే కదలటం లేదు అన్నారు భగవాన్.

చిన్న రహస్యం మీ గుండెల్లో పెట్టుకోండి. మీ మనస్సులో అసలు కించిత్తు కూడా దోషం లేదు అనుకోండి, అది ఆత్మాకారం చెందుతుంది. సరిగ్గా నది వెళ్ళి సముద్రంలో



**ఎదుటివాళ్ళు మనగురించి చెప్పకోవాలి అని కాని, మనకు కీర్తి రావాలి అని కాని, మనకు గొప్పలు రావాలి అని కాని, ఇటువంటి మాటలు మీరు వదిలేసి, మీరు మామూలుగా చేసే పనులు ఈశ్వరుడి ప్రీతికోసం చేస్తే ఈ లోకంలో ఉండగానే, ఈ శరీరం ఉండగానే జ్ఞానులు అయిపోతారు.**

కలిసినట్టు, అది ఆత్మలో లయమవుతుంది. మనలో కించిత్తు దోషం ఉన్నా అక్కడ ఉండలేక బయటికి వచ్చేస్తుంది. నిజమైన వీరుడు ఎవరు అంటే మనసుని జయించిన వాడే నిజమైన వీరుడు అన్నారు. ప్రపంచాన్ని జయించిన వాడి కంటే తన మనస్సుని జయించిన వాడు చాలా గొప్పవాడు. ప్రపంచాన్ని జయించిన వాడికిఏమికలిసివస్తుంది? ఏమికలిసిరాదు. బూడిద వస్తుంది చివరికి, ఏమీ రాదు. అలెగ్జాండరుకి ఏమైంది? అలెగ్జాండర్ ఎన్నో దేశాలు జయించాడు. ఇన్ని దేశాలను జయించినా సరే దుఃఖం తప్పలేదు వాడికి, నేను ఏమి సాధించాను అంటే ఏమి కనపడటం లేదు వాడికి. దుఃఖమే మిగిలింది చివరకు. అప్పుడు ఏమి చేశాడు అంటే అతను మరణించినప్పుడు, శరీరం అంతా భూమిలో పెట్టేయమన్నాడు. రెండు చేతులు మటుకు పైకి విడిచి పెట్టేయమన్నాడు. అంటే ఏమిటి అలెగ్జాండర్ చక్రవర్తి అంతటి వాడు చేసింది ఏమికనపడటం లేదు అని. ఎన్నో దేశాలు జయించాడు. చివరకి బూడిద మిగిలింది వాడికి, దుఃఖం తప్పలేదు. తాను సంపాదించిన దేశాలు వాడికి ఉన్నాయా అంటే అవి లేవు. చివరికి దుఃఖం మిగిలింది. అంటే ఏమిటి వాడి మనసుని గనుక వాడు జయించి ఉంటే వాడు జ్ఞాని అవుతాడు, సుఖాన్ని పొందుతాడు. అంటే లోకాన్ని జయించిన వాడి కంటే తన మనస్సుని జయించిన వాడు నిజమైన వీరుడు.

మీరు ఎన్నో ఆధ్యాత్మిక గ్రంధాలు చదివారు. పెద్దల సహవాసం చేశారు. మీరు సుఖ పడటం కోసం, మీరు శాంతి పొందటం కోసం, మీ మనస్సే మీకు అడ్డు వస్తోంది అన్న విషయం మీకు ఎంతవరకు తెలుసు? వారు చాలాదూరం వెళ్ళిపోయారండి ఎక్కడో ఉంటున్నారు. తపస్సు చేసుకుంటున్నారు అని చెపుతారు. అసలు తపస్సు అంటే ఏమిటి? మన మనస్సు విడిచి పెట్టేసి, అహంకారం విడిచి పెట్టేసి తపస్సు చేస్తే ఎలా పవిత్రం అవుతావు? ఎలా గట్టెక్కుతావు. రామ భక్తుడు ఉన్నాడు అనుకోండి, లేకపోతే కృష్ణ భక్తుడు ఉన్నాడు అనుకోండి, రామ భక్తుడికి వాడి దేహం జ్ఞాపకం వస్తుందా? లేకపోతే రాముడు జ్ఞాపకం వస్తున్నాడా వాడికి? రామ భక్తుడు అనటం నిజమైతే దేహం అసలు జ్ఞాపకమే రాకూడదు, రాముడే జ్ఞాపకం రావాలి. అయితే నాకు నా మనస్సు, నా దేహం జ్ఞాపకం వస్తుందా? రాముడు జ్ఞాపకం వస్తున్నాడా? మీలో భక్తులు కనుక ఉంటే పరిశీలించుకోండి. నేను రామ భక్తుడని అయితే నాకు రాముడే జ్ఞాపకం రావాలి. నా దేహం, నా మనస్సు నాకు

జ్ఞాపకం వస్తే నేను రామ భక్తుడని ఎలా అవుతాను? నా దేహానికి భక్తుడని, నా మనస్సుకి భక్తుడని, లోకానికి భక్తుడని. నా దేహానికి నేను భక్తుడని కాబట్టి నాకు అస్తమాను దేహం జ్ఞాపకం వస్తోంది. రాముడు జ్ఞాపకం రావటం లేదు. నేను రామ భక్తుడని అయితే నాకు రాముడే జ్ఞాపకం రావాలి కదా, నాకు దేహం ఎందుకు జ్ఞాపకం వస్తోంది?

కొంతమంది కోరికలు లోపల పెట్టుకుని భగవంతుడిని ప్రార్థిస్తారు. అది తప్పు అని నేను చెప్పను. లోపల కోరికలతోటి భగవంతుడిని ప్రార్థిస్తుంటే, వీడు కోరికలకి భక్తుడా? లేకపోతే భగవంతుడికి భక్తుడా? మీరు సూక్ష్మంగా ఆలోచించండి. నాకు ఏదో ఒక కోరిక ఉంది. నేను ఎవరో అరుణాచలేశ్వరుడినో లేకపోతే రాముడినో, కృష్ణుడినో, యేసుక్రీస్తునో, అల్లానో, ప్రార్థిస్తున్నాను కోరిక నెరవేర్చమని, నా కోరిక నెరవేర్చమని నేను ప్రార్థించేటప్పుడు నా కోరికకి నేను భక్తుడనా? లేకపోతే ఆ దైవానికి నేను భక్తుడనా? నా కోరికకి నేను భక్తుడిని అని తెలుస్తోంది కదా! ఇక్కడే మీరు ఆలోచించాలి. నా కోరిక ఆ దైవం నేరవేరుస్తాడు. పోనీ కాదు అనడం ఎందుకు? కొంతమందికి కోరికలు నేరవేరుస్తున్నాడు కదా? నాకున్న కోరిక నెరవేరిపోతుంది, నేను ఎంతకాలం సుఖపడతాను? నాకున్న కోరిక నెరవేరినప్పుడు కూడా నేను సుఖంగా ఉన్నానా? నాకేదో కోరిక నెరవేరింది అండి, ఒకగంటో, రెండు గంటలో, రెండు రోజులో, మూడు రోజులో, నేనుసుఖంగా ఉంటాను. ఆ సుఖం అప్పుడు ఎక్కడ నుంచి వస్తోంది? ఆ దేవుడు ఇస్తున్నాడా నాకు? ఆ సుఖం ఎక్కడ నుంచి వస్తోంది? ఇప్పుడు నాకు డబ్బు కావాలి, ఎవరో తెచ్చి నాకు లక్ష రూపాయలు చేతిలో పెట్టారు. చాలా శాంతిగా ఉంది, ఆనందంగా ఉంది. అంటే మీరు ఇచ్చిన కాగితాలు నాకు శాంతిని తీసుకు వస్తున్నాయా? లేకపోతే శాంతి అనేది ఎక్కడ నుంచి వస్తోంది? ఇది ఎప్పుడైనా ఆలోచించారా మీరు? మీ కోరిక నెరవేరినప్పుడు కూడా మీకు సుఖం ఎక్కడ నుంచి వస్తుంది? మీకు అప్పుడప్పుడు కోరికలు నెరవేరుతున్నాయి కదా, నెరవేరినప్పుడు ఆ సుఖం మీకు ఎక్కడ నుంచి వస్తుంది? ఇది ఎప్పుడైనా ఆలోచించారా మీరు? మీరు మనసు మనసు అంటారు చూశారు మీ కోరిక నెరవేరినప్పడు ఈ మనసు దాని పుట్టింటికి వెళుతుంది ఆ పుట్టింటికి వెళ్ళినప్పుడు ఆత్మకు సంబంధించిన సుఖం మీకు వ్యక్తం అవుతుంది. అబ్బా ఎంత సుఖంగా ఉందో, ఎంత ఆనందంగా ఉందో అనిపిస్తుంది, ఎందుచేత మనసు పుట్టిల్లు కదా అది, అక్కడకు వెళ్ళేటప్పుడు కొంతసేపు గంటో, రెండు గంటలో, శాంతిగా

ఉంటుంది. అంటే ఏమిటి, మీ మనస్సు అంతర్ముఖం అవుతుంది, ఎప్పుడు? మీ కోరిక నెరవేరినప్పుడు. మనస్సు అంతర్ముఖం అయిన గంట, రెండు గంటలు ఎంతో శాంతిగా ఉన్నట్టు ఉంటుంది. కాని అది మళ్ళీ బయటికి వచ్చి విజృంభించేస్తుంది. మీకు శాంతిగా ఉంది అనుకున్నప్పుడు, ఆనందంగా ఉంది అనుకున్నప్పుడు కూడా అది ఆత్మ లోంచే వస్తుంది. అసలు శాంతి అక్కడే ఉంది, లోకంలో అసలు శాంతి లేదు, ఆనందం లేదు.

కుందేలుకి కొమ్ములు ఉండవు. అది లావుగా ఉందా? సన్నంగా ఉందా? అంటే, అసలు లేని దానికి లావు ఏమిటి, సన్నం ఏమిటి? జ్ఞానికి శరీరం లేదు, మనసు లేదు, ప్రపంచం లేదు. మనస్సు, శరీరం వాడికి లేదు ఇంకదేనిని జయిస్తాడు వాడు అసలు. తనకంటే వేరుగా ఏదైనా ఉంటే అక్కడ జయించడం. తనకంటే వేరుగా కనుక ఏదైనా కనిపిస్తుంటే దుఃఖం తప్పనిసరిగా వచ్చేస్తుంది. ద్వైతం ఉన్నంత సేపు దుఃఖం వచ్చేస్తుంది తనకంటే వేరుగా ఏదీ లేనప్పుడు దేనిని జయిస్తాడు అసలు? భగవంతుడు ఏమని చెప్పాడు అంటే, నువ్వు క్రోధాన్ని నిగ్రహించుకోకపోతే, లోభాన్ని నిగ్రహించుకోకపోతే, కామాన్ని నిగ్రహించుకోకపోతే వీటి వల్ల నరకంలో పడతావు. కామం, క్రోధం, లోభం నరకానికి గేటులు అని చెప్పాడు. చచ్చిపోయిన తరువాత కదా ఆ గొడవ? ఇవన్నీ ఉన్నాయా, లేదా? భగవంతుడు ఏమి చెప్పాడు అంటే నరకానికి అవి తీసుకువెళతాయి కాబట్టి వదిలించు కోమన్నాడు. చచ్చిపోయిన తరువాత కదా నరకానికి వెళ్ళేది. ఇక్కడ లేదు కదా నరకం? చచ్చిపోయిన తరువాత పోనీ నరకానికి వెళతాం అండి, బ్రతికున్నన్నాళ్ళు సుఖంగా ఉండచ్చు కదా! అమెరికాలో ఏమి జరుగుతోంది, రష్యాలో ఏమి జరుగుతోంది, ఇంగ్లాండులో ఏమి జరుగుతోంది, హైదరాబాదులో ఏమి జరుగుతోంది, ఇవన్నీ తెలుసుకోవాలి అని ఉంటుంది మీకు, ఆత్మని అన్వేషించటం మానేసి ఊర్లో ఏమి జరుగుతోంది, పేపర్లో ఏమి రాశారు ఇవన్నీ తెలుసుకోవాలి అని ఉంటుంది. ఇదే పెద్ద మాయ. ఏమి జరుగుతుంది? ఎక్కడ చూసినా లోకంలో రాగ ద్వేషాలే!

ఎవరో ఒక భక్తుడు వచ్చి భగవాన్‌తో అన్నాడు మీరు చాలా గొప్పవారు అని, మనకైతే సంతోషంగా ఉంటుంది. ఇద్దరు ఉంటే ఒకడు గొప్పవాడు, ఒకడు తక్కువ వాడు అవుతాడు. అసలు ఉన్నది ఒక్కటే వస్తువు అయితే గొప్పవాడు ఏంటి, తక్కువవాడు ఏంటి? ఒకే గీత

ఉంది ఇక్కడ, పెద్ద గీతా? చిన్న గీతా? అంటే ఎవడుచెబుతాడు దానికి? మీరు చాలా గొప్పవారు అని భగవాన్‌తో ఒకాయన అన్నారు. అప్పుడు భగవాన్ అన్నారు, నేను గొప్ప వ్యక్తిని అని నువ్వు చెబుతున్నావు. ఈ మాట వల్ల నీకు కలిసి వచ్చేది ఏమిటి అని అడిగారు. నేను నిజంగా గొప్పవాడిని అనుకో, నువ్వు బాగు పడేది ఏమిటి? నీకు కలిసి వచ్చేది ఏమిటి? రాముడు గొప్పవాడు, వసుదేవుని కుమారుడు వాసుదేవుడు గొప్పవాడు. అళగమ్మ వాళ్ళ కొడుకు రమణ స్వామి చాలా గొప్పవాడు. అయితే మనకి కలిసి వచ్చేది ఏమిటి? వాళ్ళు సుఖ పడ్డారు, వాళ్ళు శాంతి పొందారు. మనకి కలిసి వచ్చేది ఏమిటి? మనం ఎందుకు కూర్చున్నట్టు? ఇంత దూరం ఎందుకు వచ్చినట్టు?

ఎవడో IAS పాస్ అయ్యాడు, పాస్ అయ్యినవాడు కలెక్టర్ ఉద్యోగం చేస్తాడు. మన మాట ఏమిటి? మన సమస్య ఏమిటి? అని అడుగుతున్నారు. అదే రమణ స్వామి అడిగింది, నేను చాలా గొప్పవాడిని అని నువ్వు చెబుతున్నావు. పోనీ నువ్వు చెప్పేది నిజమే అనుకుందాం మాట వరసకి. దీనివల్ల నీకు కలిసి వచ్చేది ఏమిటి? నువ్వు పొందేది ఏమిటి? అంటే భగవాన్ ఏమి అన్నారు ప్రతీ మనిషి కూడా తాను ఎవడో తాను తెలుసు కోవడానికి ప్రయత్నం చెయ్యడు. తాను ఎవడో తనకి తెలియనప్పుడు ఎవడో గొప్పవాడు అయితే వీడికి కలిసి వచ్చేది ఏమిటి? వీడు సుఖపడేది ఏమిటి? భీమవరంలో ఎవడి దగ్గరో పది కోట్లు ఉన్నాయి. ఆ పది కోట్లు మన డబ్బు అవుతుందా? కాదు. చాలామంది మతం పేరు మీద విజ్ఞానానికి దూరం అవుతున్నారు అని నా ఉద్దేశ్యం. విజ్ఞానానికి ఎప్పుడూ మీరు దూరం అవ్వద్దు. హేతువాదానికి కూడా దూరం అవ్వద్దు. విష్ణువు గొప్పవాడు అని విష్ణు భక్తులు, శివుడు గొప్పవాడు అని శివ భక్తులు అంటున్నారు. వీడు గొప్పవాడు, వాడు గొప్పవాడు అంటే వీళ్ళకి కలిసి వచ్చేది ఏమిటి? మనం మనస్సుకి బానిసలం, దేహానికి బానిసలం, ఈ బానిసత్వం నుండి మనం విడుదల పొందలేదు. మనకి జ్ఞానం ఎక్కడ

**భగవంతుడు చెప్పే మాటల మీద ఎంతవరకు నీకు విశ్వాసం కలుగుతుందో, అంతవరకూ దేవుడి యొక్క కృప నీ మీద ఉన్నట్టే.**



నుంచి వస్తుంది? మాకు పని చెయ్యడం ఇష్టమే అండి, ఎవరైనా ఏదైనా అనుకుంటారు ఏమో అని భయం అంటారు. అంటే ఎవరైనా ఏదైనా అనుకుంటారు అంటే వాళ్ళు లోకులకు బానిసలు అని. వాడి మనసు బానిసత్వంలో ఉంది, బానిసత్వంలో ఉన్న మనసు తోటి స్వతంత్రుడు ఎలా అవుతాడు? స్వతంత్రం అవ్వకుండా వాడు ఎలా సుఖపడతాడు? జపం చెయ్యమన్నారు, విష్ణు సహస్రనామాలుచదవమన్నారు, లలితాసహస్రనామాలుచదవమన్నారు. ఈ నామాలు అన్నీ చదవమన్నారు. ఇవన్నీ ఎందుకు పెట్టారు శాస్త్రంలో? మనస్సు నిగ్రహించుకోవడం కోసం. అంటే మనస్సు శుచి కోసం. అంటే రోజూ మనం శరీరానికి స్నానం ఎలా చేస్తున్నామో, ఈ పూజ , జపం మనస్సుకి స్నానం చేస్తున్నట్టు. నీళ్ళతోటి ఏమో శరీరానికి స్నానం చేస్తున్నాం, ప్రార్ధన తోటి ఏమో మనసుకి స్నానం చేయిస్తున్నాం.

విష్ణువు కనిపించాడు, శివుడు కనిపించాడు అని చెబుతూ ఉంటారు. నిజమే అనుకుందాం. కనిపించవచ్చు. దానివల్ల మీకు కలిసి వచ్చేది ఏమిటి? మీకు కనిపించిన దేవుడు మీ దగ్గర ఎంతసేపు కూర్చుంటాడు? అసలు మీ శరీరమే మిమ్మల్ని విడిచి పెట్టి వెళ్లిపోతుంటే, మీకు కనిపించిన దేవుడు ఎంతసేపు ఉంటాడు మీ దగ్గర? మీకు దేవుడు నిజంగా కనిపించాడు అనుకోండి మీ అజ్ఞానం పోతుందా? ఇది మీరు ఆలోచించాలి. లోపల అజ్ఞానం ఉన్నంత కాలం ఎన్ని జన్మలు ఎత్తినా దుఃఖం వచ్చేస్తూ ఉంటుంది. దానిని ఎవరు ఆపు చేసుకోలేరు. లోపల అజ్ఞానం ఉన్నంతకాలం దుఃఖం వచ్చి తీరుతుంది. దుఃఖం ఎంతకాలం అయితే మీకు వస్తుందో అప్పుడు నరకం తప్పదు. చచ్చిపోయిన తరువాత నరకం ఏమిటి? ఇప్పుడే నరకం అనుభవిస్తున్నాం, దుఃఖం వస్తోంది కదా మనకి. శరీరం పోయిన తరువాత నరకం ఎందుకు? ఇప్పుడే దుఃఖం వస్తుంది అంటే నరకం అనుభవిస్తున్నట్టే. జ్ఞానిని తీసుకెళ్ళి నరకంలో పడేస్తే, నరకం కూడా వాడికి వైకుంఠం కింద ఉంటుంది.

మనకు ఎంతసేపు ఒకళ్ళ మీద ఇష్టంగా ఉంటుంది, ఒకళ్ళ మీద అయిష్టంగా ఉంటుంది. ఆ దుమ్ము దులుపుకోవటమే, దానిని పోగొట్టుకోవటమే మనసుని జయించటం. మిమ్మల్ని సంతోషపరచే మాటలు నాకు చెప్పాలని లేదు, మీకు హితవు కలుగజేసే మాటలే చెప్పాలని ఉంది. నాకు కావలసింది మీ సంతోషం కాదు, మీ హితవు. లోకం అంతా స్వప్నం అయినపుడు మీకు కనిపించే దేవుడు మటుకు స్వప్నంలో భాగమే కదా. మన

దేహానికే మనం భక్తులం, దేవుడికి భక్తులం కాదు. పరమార్థం పెంచుకోవటానికి ఏదైనా మంచి మాటలు చెప్పినా మనకు సంతోషం రాదు. మన అహంకారం పొంగే మాటలు చెబితే మనకు సంతోషం వస్తుంది. ఎందుచేత? మనం మనలో ఉన్న పరమాత్మకంటే మన అహంకారాన్ని ఎక్కువ ఇష్ట పడుతున్నాం కాబట్టి. నేను మీకు నిజం చెబుతాను అనుకోండి మీరు సంతోషించరు. మీకు మనసులో ఏది ఇష్టమో అది చెబితే సంతోషిస్తారు. అది అబద్ధం అయినా సరే, మీకు నచ్చింది కాబట్టి సంతోషిస్తారు. నేను చెప్పింది నిజం అయినప్పటికీ మీకు నచ్చకపోతే మీరు సంతోషించరు. ఇది మీరు గ్రహించండి. నేను ఒక మాట నిజం చెబితే, అది నిజం అయినప్పటికీ మీ మనస్సుకి నచ్చలేదు అనుకోండి, వదిలేస్తారు. ఎందుచేత? అక్కడ మీకు నిజం ప్రధానం కాదు, మీ మనస్సు ప్రధానం. ఇక్కడే మనిషి బానిస అవుతున్నాడు. మీకు నిజం కంటే మీ మనస్సే ముఖ్యం, అహంకారమే ముఖ్యం, మీ దేహమే ముఖ్యం. మనం అహంకారం కేంద్రంగా, మనస్సు కేంద్రంగా, దేహం కేంద్రంగా పని చేస్తున్నాం. ఆత్మ కేంద్రంగా అసలు పనే చెయ్యటం లేదు. మీ దేహాన్ని మరిచి, మీ మనస్సుని మరిచి, మీ అహంకారాన్ని మరిచి, మీ వాసనని మరిచి మీరు నిజాన్ని ప్రేమించగలరా? మీకు నచ్చకపోతే అది అబద్ధం. అబద్ధం అని మీరు పైకి అనకపోయినా మీరు దానిని స్వీకరించరు. ఎందుచేత స్వీకరించరు? అది మీ మనస్సుకి నచ్చలేదు కాబట్టి, అంటే మీ మనస్సు ముఖ్యమా? నిజం ముఖ్యమా మీకు? మీ మనస్సే ముఖ్యం. అంటే మనస్సుని దాటలేక పోతున్నారు. మనస్సుని దాటలేని వాడు జ్ఞాని ఎలా అవుతాడు?

ఒక లక్ష రూపాయలు పెట్టి గుడి కట్టమంటే కడతారు కాని, ప్రశాంతంగా ఐదు నిముషాలు కూర్చొని ఆలోచించమంటే ఎవడు ఆలోచించడు. ఒక లక్ష రూపాయలు పెట్టి రామాలయం కట్టమంటే కట్టేస్తారు, ఇంకోచోట శివాలయం కట్టమంటే కడతారు. ఆ కట్టేవాడిని రెండు నిముషాలు కూర్చొని ఆలోచించమనండి. అంటే తన మనసును తాను రెండు నిముషాలు నిగ్రహించుకోవడంకంటే లక్ష రూపాయలు ఖర్చు పెట్టి శివాలయం కట్టడం వాడికి ఇష్టం. ఇదే మాయ! అందుకే ఆచార్యులు వారు ఏమన్నారు, మనస్సుని నిగ్రహించడం మనిషికి చాలా కష్టం అని చెప్పారు. ఒక లక్ష రూపాయలే కాదు పది లక్షలు అయినా ఖర్చు పెట్టి ఒక శివాలయం కట్టమంటే కడతాడు కాని, రెండు నిముషాలు మీ మనస్సుని నిగ్రహించుకోమంటే వాడు చెయ్యడు. భగవాన్‌తో ఒక భక్తుడు స్వామి మీ

విగ్రహం దాదాపుగా తయారు అయ్యింది ఇంక తేవటమే మద్రాసు నుంచి, ఆశ్రమంలో మీ విగ్రహం పెడతారు అట అని చెప్పాడు. అంటే భగవాన్ సంతోషిస్తారు అని ఆ భక్తుడు ఉద్దేశ్యం. అప్పుడు భగవాన్ అన్నారట, అవును మరి రాతి మనుషులకి రాతి విగ్రహాలు ఉండాలి. శివుడు నిజంగా రక్త మాంసాలతోటి ఇక్కడకు వస్తే గౌరవించరు. ఆ విగ్రహంలో చూడటమే వీళ్లకు ఇష్టం. అవును మరి రాతి మనుషులకి రాతి విగ్రహాలే ఉండాలి. మీకు కొండ గుర్తు చెబుతున్నాను. ఎవరి సమక్షంలో కూర్చుంటే మీకు శాంతిగా ఉంటుందో, ఎవరి సమక్షంలో కూర్చుంటే అసలు నిగ్రహించుకోవడానికి మనస్సు అంటూ కనపడదో, వాడే నిజమైన మహాత్ముడు. ఎంత విద్య ఉంటే ఏమి లాభం? ఎంత ఐశ్వర్యం ఉంటే ఏమి లాభం? ఎంత కీర్తి ఉంటే ఏమి లాభం? మీకు శాంతి లేనప్పుడు ఎంత ఉంటే ఏమి లాభం? మీకు చాలా ఐశ్వర్యం ఉందండి మీ ఐశ్వర్యం మీకు దుఃఖం రాకుండా ఆపు చెయ్యటం లేదు. మరి ఏంటి ఈ ఐశ్వర్యం యొక్క ప్రయోజనం ఏమిటి? అది నేను మిమ్మల్ని అడిగేది.

లేకపోతే మీలో పెద్ద పెద్ద చదువులు చదువుకున్న వాళ్ళు ఉండచ్చు. మీ చదువు మీకు దుఃఖం రాకుండా ఆపు చెయ్యటం లేదు. ఇంక మీ చదువు యొక్క ప్రయోజనం ఏమిటి? కొంతమంది ఏమిఅంటారు అంటే ఏవండీ ఏమి అక్కర్లేదు, తిండి ఉంటే చాలు, గుడ్డ ఉంటే చాలు, ఉండడానికి నీడ ఉంటే చాలు ఇంకేమీ అక్కర్లేదు అంటారు. ఇక్కడ మీరు ఆలోచించాలి. మరి తిండి, గుడ్డ, నీడ ఉన్నవాళ్ళు అందరూ సుఖంగా ఎందుకు లేరు? మీరు బాగా ఆలోచించండి ఇక్కడ, వీటిని basic needs అంటారు. అంటే ప్రతీ మనిషికి తిండి అవసరం, కట్టుకోవడానికి గుడ్డ అవసరం, ఉండడానికి నీడ అవసరం. రైటే, ఇవి మూడు ఉన్నాయి. ఉన్నవాళ్ళు ఉన్నారు కదా, అయితే వాళ్ళు ఎందుకు సుఖంగా లేరు? మీరు బాగా ఆలోచించండి. మనం ఎక్కడికో వెళ్లద్దు. మిమ్మల్ని రాముడి దగ్గరకు తీసుకు వెళ్లటానికి ఇష్టం లేదు. రాముడు జ్ఞాపకం వస్తే మీకు అయోధ్య జ్ఞాపకం వస్తుంది. మీరు ఇప్పుడు భీమవరం విడిచిపెట్టి అందరూ అయోధ్య వెళ్లిపోతారు. అందుకు నాకు భయం వేస్తుంది. కృష్ణుడు పేరు ఎత్తుతాము అనుకోండి కృష్ణుడి పేరు ఎత్తేటప్పటికి బృందావనం వెళ్లిపోతారు. మీ మనస్సు ఎంతసేపు అటు గెంటేద్దాం అని చూస్తుంది. మన

మనస్సు ఏమి చేస్తుంది అంటే నెమ్మదిగా అయోధ్య గెంటేస్తే రాముడు గొప్పవాడు అని అక్కడ కూర్చుంటారు. బృందావనం గెంటేస్తే కృష్ణుడి పాటలు పాడుతూ అక్కడ కూర్చుంటారు. లేకపోతే అరుణాచలం వైపుకి గెంటేస్తే ఆ కొండ చుట్టూ తిరుగుతూ ఉంటారు. మన జోలికి రారు అనుకొంటుంది. మనసు ఏమి చేస్తుంది అంటే దాని జోలికి రాకుండా మీరు ఎంతసేపు నామం చేసినా అది ఏమి మాట్లాడదు.

నేను అయోధ్య అంటాను అనుకోండి మీకు రాముడు జ్ఞాపకం వస్తాడు. మనస్సు ఏమి అనుకుంటుంది పోనీలే వీడు రాముడిని తలచుకుంటున్నాడు మన జోలికి రావటం లేదు అనుకుంటుంది. దాని జోలికి రాకుండా మీరు ఏ దేవుడిని తలచుకున్నా, యేసు క్రీస్తుని తలచుకున్నా దానికి అభ్యంతరం లేదు. బుద్ధుడిని తలపెట్టుకున్నా దానికి అభ్యంతరం లేదు. దాని జోలికి వచ్చారంటే అక్కడ పోరాటం ఏర్పడుతుంది. జీవితంలో ఎప్పుడైనా పోరాటం ఎలా ఉంటుందో మీరు చూశారా అసలు? ఎప్పుడైనా మీరు మనస్సుని ఎదుర్కొంటే కదా అసలు. మీరు రాముడిని స్మరిస్తున్నారు, కృష్ణుడిని స్మరిస్తున్నారు. మీ మనస్సుని మీరు ఎప్పుడైనా ఎదుర్కొంటే కదా ఆ పోరాటం ఎలా ఉంటుందో తెలియటానికి. గీతలో పరమాత్మ నన్ను తెలుసుకోమని చెప్పాడు. మీరు తత్త్వం దగ్గరకు ఎందుకు రారు? నన్ను తెలుసుకోండి, నన్ను తెలుసుకోండి అని గీత పొడవునా చెబితే నన్ను అంటే అయన శరీరాన్ని, ఆయన కళ్లను, ఆయన ముక్కునుతెలుసుకోమనా? మనకు లేవా ముక్కు, కళ్ళు, చేతులు? నన్ను తెలుసుకోండి అంటే ఆయన ఉద్దేశ్యం ఏమిటి అంటే మీలో ఆత్మగా నేను ఉన్నాను. అది తెలుసుకోమని! ఆత్మని తెలుసుకోమని చెప్పటానికే నన్ను తెలుసుకోమని చెప్పాడు. మనకి ఒకొక్కసారి హెచ్చు తగ్గులు వస్తూ ఉంటాయి. ఒకరోజు కొంచెం భక్తి ఎక్కువగా ఉన్నట్టు



**ప్రతి మానవుడికి వాడి స్వరూపమే సుఖం, వాడి స్వరూపమే శాంతి, ప్రతి మానవుడు తన మనస్సుని నిర్మలం చేసుకొని, తన హృదయంలోకి పంపించి అంతర్ముఖం చేయగలిగితే అప్పుడు వాడికి శాంతి దొరుకుతుంది.**

ఉంటుంది. తరువాత రోజున తక్కువగా ఉన్నట్టు ఉంటుంది. కొంచెం మారిపోతూ ఉంటుంది. ఇవాళ భక్తి చాలా బాగుంది, మన మనసు బాగుంది రేపు తేడా వచ్చేస్తుంది. ఇవన్నీ అహంకార లక్షణాలు. ఇవాళ బానే ఉంది అనిపిస్తుంది. మళ్ళీ రేపు తేడా వచ్చేస్తుంది. ఇవన్నీ అహంకారం యొక్క చేష్టలు.

భగవాన్ దగ్గరకు ఒకతను వచ్చి ఏమి చెప్పాడు అంటే స్వామి మేము అరవింద్ ఘోష్ గారి ఆశ్రమానికి వెళ్ళి అక్కడ యోగం నేర్చుకున్నాం. గాంధీగారి ఆశ్రమానికి వెళ్ళాం, అక్కడేమోఆహార నియమం నేర్చుకున్నాం, శివానంద గారి దగ్గరకు వెళ్ళాం, ప్రాణాయామం నేర్చుకున్నాం, రామదాసు గారి దగ్గరకి వెళ్ళాం, అక్కడ నామం చెయ్యటం నేర్చుకున్నాం అండి స్వామి, ఇవన్నీ తిరిగి మీ దగ్గరకు వచ్చాం అండి స్వామి అన్నాడు. సరిగ్గా వాడు ఆ మాటలు చెప్పటం పూర్తి అయ్యింది అంతలో భోజనానికి గంట కొట్టారు. అప్పుడు భగవాన్ అన్నారు ఇప్పుడు మన ఇద్దరం కలిసి భోజనం చేద్దాం అన్నారు. ప్రాణాయామం కూడా మనసుని నిగ్రహించుకోవడానికి ఒక సాధన. అది చేసుకుంటే చేసుకోవచ్చు. భగవాన్ దగ్గర ప్రాణాయామం ఎందుకు చెప్పండి? వాడు ఏమి చేశాడు అంటే, భగవాన్ దగ్గర ప్రాణాయామం చేసి గాలి పీల్చుకుని అలా బిగపెట్టి ఉంచేటప్పటికి కుంభకం నిలబడటం లేదంట. స్వామి స్వామి గాలి ఆగటం లేదు అన్నారట, అంటే కుంభకం నిలబడటం లేదు అని వాడు చెప్పేది. అప్పుడు భగవాన్ అన్నారట మొత్తానికి పోతే గొడవ వదిలి పోతుంది అన్నారట. అంటే మహాత్ములు దగ్గరకి వెళ్ళినప్పుడు ప్రశ్న వెయ్యటం చేతకాదు చాలా మందికి. అందుకు ఈ మాటలు నేను చెబుతున్నాను. ఎవరు చెప్పినా మాయని జయించండి అంటారు. మాయ ఎక్కడుంది జయించటానికి? మీ మనస్సే మాయ. ఇది బాగా అర్థం చేసుకోండి. మాయని జయించండి, జయించండి అంటే మాయని జయించటానికి ఎక్కడుంది? బయట ఉందా జయించటానికి తుపాకులు పెట్టుకుని వెళ్ళటానికి, నిజంగా బయట ఉంటే ఈ పాటికి చాలామంది జయించేద్దురు. అది బయట ఉందా? మీ మనస్సే మాయ. మీ మనస్సుని తీసేసి చూడండి మాయ ఎక్కడుందో చెప్పండి. మనస్సు లేనివాడికి మాయ లేదు.

వాల్మీకి ఏమి చెప్పాడు అంటే ప్రపంచంలో ఉన్న మాయని అంతా తీసుకొచ్చి డబ్బులో

పెట్టాడు అని చెప్పాడు. వాల్మీకి రామాయణంలో వాల్మీకి చెప్పిన మాట, నేను కాదు చెబుతుంట. ప్రపంచంలో ఉన్న మాయని అంతా తీసుకొచ్చి డబ్బులో పెట్టాడు అట. అందుచేత మీరు ఏ ఊర్లో చూసినా ఏ కుటుంబంలో చూసినా డబ్బు గురించి పేచీలే. మిమ్మల్ని మీరు తెలుసుకోవడం కోసం మీరు పూజ చేస్తున్నారు. మిమ్మల్ని మీరు తెలుసుకోవడం కోసమే దానాలు చేస్తున్నారు. మీరు భక్తి చేస్తున్నారు అంటే మిమ్మల్ని మీరు తెలుసుకోవటం కోసమే భక్తి చేస్తున్నారు. మీరు ఎదుటి వాడికి ఉపకారం చేస్తున్నారు అంటే మిమ్మల్ని మీరు తెలుసుకోవడం కోసమే ఉపకారం చేస్తున్నారు. మీరు చేసే పనులు అన్నీ మిమ్మల్ని మీరు తెలుసుకోవడం కోసం జరిపే పోరాటం. ఏవండీ చెడ్డవాడు చెడ్డ చెయ్యడం కూడా సుఖ పడటం కోసమే ఇది మర్చిపోకండి. ఒక దుర్మార్గుడు ఉన్నాడు. వాడు చెడ్డ పనులు చేస్తూ ఉంటాడు. ఎందుకు చెడ్డ చేస్తాడు వాడు? మనకి దుర్మార్గం కింద కనిపించవచ్చు. వీడికి చెడ్డ చేస్తే వాడికి సుఖం వస్తుందని, వాడు సుఖం కోసమే చేస్తున్నాడు. అక్కడ కూడా వాడి సుఖమే కావాలి. వాడు చేసే చెడ్డ కూడా వాడి సుఖం కోసమే చేస్తున్నాడు. ఈ విషయం గ్రహించాలి మనిషి. ప్రతీ మనిషి చెడ్డ ద్వారా కూడా తన సుఖాన్నే తాను కోరుకుంటున్నాడు. తరువాత వాడికి దుఃఖం రావచ్చు అది వేరే విషయం. కాని వాడు సుఖం వస్తుంది అనుకుని ఆ పని చేస్తున్నాడు, లేకపోతే వాడుచెయ్యడు.

మీరు దేవుడు కావాలి అనుకుంటున్నారు కాని అది అబద్ధం. దేవుడు కాదు కావాల్సింది, సుఖం కావాలి ప్రతి మనిషికి. దేవుడు కావాలి అనుకోవడం అబద్ధం. ప్రతీ మనిషికి సుఖమే కావాలి. చెడ్డవాడు కూడా సుఖ పడదాం అనే చెడ్డ పనులు చేస్తున్నాడు. దానివల్ల దుఃఖం వస్తుంది వాడికి అని తెలియక సుఖం వస్తుంది అనుకుని చెడ్డ పనులు చేస్తున్నాడు. సుఖం వస్తుంది అనుకోకపోతే ఆ చెడ్డ పని వాడు చెయ్యడు. మీరు అందరూ దేవుడిని ప్రార్థిస్తున్నారు. దేవుడు కోసం కాదు. మీరు సుఖ పడటం కోసం, మిమ్మల్ని మీరు తెలుసుకోవడం కోసం దేవుడిని ప్రార్థిస్తున్నారు. మీకు సుఖం లేనప్పుడు దేవుడు వల్ల మీకు ఉపకారం ఏమిటి? దేవుడు కనిపిస్తాడు అండి. మీకు సుఖం లేదు అండి, ఆ దేవుడిని మీరు ఏమి చేసుకుంటారు? సబ్జెక్టు ఆలోచించండి మీరు. నాకు సుఖం అక్కర్లేదు అని చెప్పే మనిషి ఉన్నాడా ఈ సృష్టిలో? ఈ విశాలమైన ప్రపంచంలో, నాకు సుఖం అక్కర్లేదు

అని చెప్పే మనిషి ఒక్కడు ఉన్నాడా? మాకు దేవుడు అక్కర్లేదు అని చెప్పేవాళ్ళు ఉన్నారు. కాని నాకు సుఖం అక్కర్లేదు అని చెప్పే స్త్రీ కాని, నాకు సుఖం అక్కర్లేదు అని చెప్పే పురుషుడు కాని, లోకంలో ఎక్కడైనా మీకు కనిపించాడా?

మనకి కోరికలు లేవు అనుకోండి ఇంక ఈ దేహం తోటి పని ఏముందిమనకి? మీరు జాగ్రత్తగా ఆలోచించండి. మీరు అయోధ్య వెళ్ళద్దు, బృందావనం వెళ్ళద్దు, కాసేపు ఆగండి. మీకు అసలు కోరికలు ఏమి లేవు అనుకోండి అసలు దేహం తోటి పని ఏముంది? మేము భీమవరంలో కౌన్సిలర్ అవ్వాలి అంటే ఇప్పటి నుంచి జనాన్ని పోగుచేసుకోవాలి, ఏదో ఒక పని ఉంటుంది. అసలు ఏ రకమైన కోరిక మీకు లేదు అనుకోండి, మీకు దేహం తోటి పని ఏమిటి చెప్పండి? కూలి వాడికి రైల్వే స్టేషన్‌లో పెట్టెలు పెడతాం నెత్తిమీద. ఈ పెట్టె ఎప్పుడు మన నెత్తిమీద ఉంటే బాగుండును అని వాడు అనుకుంటాడా? లేదు? వాడు ఏమి అనుకుంటాడు ఈ పెట్టె ఎప్పుడు దింపేద్దాము అని చూస్తాడు. జ్ఞానికి తన దేహం కూడా అలా ఉంటుంది. ఈ మధ్యన ఒక ముసలమ్మగారు చనిపోయారు, ఈ ముసలమ్మగారు పోయిన వార్త ఇంకో వందేళ్ళు ఉన్న ముసలమ్మగారికి తెలిసింది అటండి. నేను కథ చెబుతున్నాను అనుకోకండి. జాగ్రత్తగా వినండి, ఈ వార్త తెలిసాక ఆవిడ రోజూ ఏడుపే, నాకు కూడా చావు వచ్చేస్తుంది ఏమో అని, ఆ భయం చూడండి, ఆవిడ ఆరోగ్యంగానే ఉన్నారు, వందేళ్ళు వచ్చినా ఆరోగ్యంగానే ఉన్నారు. అంటే ఏమిటి ఆ వార్త తెలిసింది ఆవిడకి. మన చుట్టాలు ముసలమ్మ చచ్చిపోయింది అని, ఈవిడ రోజూరాత్రి, పగలు ఏడుపు. నాకు కూడా చావు వచ్చేస్తుంది ఏమో అని, వందేళ్ళు వచ్చాయి కదా, నిజంగా చచ్చిపోతే నష్టం ఏమిటండి ఆవిడకి? మీరు బాగా ఆలోచించాలి ఇక్కడ విషయం. ఆవిడకి మంచం పట్టిన వయసు. బ్రతికి ఉన్నా సుఖం లేదు, కాని ఆవిడకి ఇంకా బ్రతకాలని ఉంది కారణం ఏమిటి చెప్పండి?

మనం అందరం ఇక్కడ కూర్చున్నాం. ఎవరికి అయినా చచ్చిపోవాలి అని ఉందా అండి? అవసరం అయితే పదివేలు పడేసి రాయ వెల్లూరు వెళ్ళిపోవాలి అని ఉంటుంది కాని చచ్చిపోవాలి అని ఎవరికీ ఉండదు? పదివేలు కాదు కదా, ఎకరం పొలం అమ్మేసి మద్రాసు, రాయవెల్లూరు వెళ్లి వైద్యం చేయించుకోవాలి అని ఉంటుంది కాని చచ్చిపోవాలి అని ఉంటుందా ఎవడికి అయినా? ఇక్కడే హేతువాదం ఉందండి. బ్రతికి ఉండాలి అంటే

ఎందుకు బ్రతికి ఉండాలి అనుకుంటున్నాము? మనం బ్రతికి ఉండి ఉద్ధరించేది ఏమిటి? మీరు ఎందుకు ఆలోచించరు ఇది? మీరు ఎంతసేపు రామాయణం గురించి ఆలోచిస్తున్నారు. దశరథుడి కొడుకు రాముడు, రాముడి తమ్ముడు లక్ష్మణుడు గురించి ఆలోచిస్తున్నారు. రైటే మంచిదే!ప్రతివాడు బ్రతకాలి అనుకుంటున్నాడు. చచ్చిపోవాలి అని ఎవడూ అనుకోడు? చచ్చిపోవాలి అని ఎందుకు అనుకోడు మనిషి? అది మిమ్మల్ని నేను అడిగేది. బ్రతికుండాలి అని ప్రతీవాడు, వందేళ్ళ ముసలమ్మ కూడా నేను ఇంకా బ్రతకాలి అనుకుంటుంది. చచ్చిపోతే నష్టం ఏమిటి? ఆవిడ చెయ్యవలసిన పెళ్ళిళ్ళు అన్నీ చేసేసింది. ఆవిడకి సంసారం లేదు. ఊరు పొమ్మంటుంది, వల్లకాడు రమ్మంటుంది. అయినా అలా బ్రతకాలి అనుకొంటోంది. ఎందుచేత అంటే మనం బ్రతకాలి అని ఎందుకు అనుకుంటున్నాం అంటే మనలో ఉన్న నిజమైన ఆత్మకు చావు లేదు. శరీరానికి చావు ఉంది. మనలో ఉన్న నిజమైన ఆత్మకి చావు లేదు. అదే మనం. అది మనం కాబట్టి మనం చావకూడదు, చావకూడదు అనుకుంటున్నాం. మనకు తెలియకుండా వచ్చేస్తుంది అది. మనం శరీరం కాదు. మనం మనస్సు కాదు. మనం నిజమైన ఆత్మ. లోపల ఉన్న నిజమైన ఆత్మ. దానికి చావులేదు. అది మనకి అనుభవం లేదు కాని దానికి చావు లేదు. మనం చావు లేని వాళ్ళమే. అందుకే నాకు చావు రాకూడదు, చావు రాకూడదు అనుకుంటున్నాం.

అనారోగ్యం తోటి బాధపడేటప్పుడు కూడా తన సుఖం కోసం చావాలని కోరుకుంటాడు. రోగం తోటి బాధ పడలేక పోతున్నాడు కాబట్టి చావు కోరుకుంటాడు ఏమో కాని, తనకి ఆరోగ్యంగా ఉంటే ఎవడు చావు కోరుకోడు. రోగం తోటి బాధ పడేటప్పుడు కూడా తన చావు ఎందుకు కోరుకుంటున్నాడు? సుఖం కోసమే కోరుకుంటున్నాడు అక్కడ కూడా తన సుఖం ముఖ్యం. ఎందుచేత? ఆత్మ నిజమైన సుఖం కాబట్టి. సుఖం కోసం తన దేహం కూడా పోవాలి అనుకుంటున్నాడు. శరీరం నన్ను బాధిస్తోంది అండి, నేను సుఖపడటం లేదు. ఈ దేహం పోతే బాగుండును, ఈ రోగం తగ్గటం లేదు అంటాడు. అంటే ఏమిటి? తన దేహం కంటే తన సుఖాన్ని ఎక్కువ ప్రేమిస్తున్నాడు. ఎందుచేత లోపల ఉన్న ఆత్మ నిజమైన సుఖం కాబట్టి. మన ఆత్మకు చావు లేదు. చావు లేదు కాబట్టే మనం అందరం ఎప్పుడూ జీవించి ఉండాలి అని కోరుకుంటున్నాం. ఆత్మకు దుఃఖం లేదుఅందుచేత

మనం దుఃఖంలో ఉండకూడదు అని కోరుకుంటున్నాం. ఆత్మ బానిస కాదు. ఆత్మ స్వతంత్ర్యమైనది అందుచేత మనం అందరం స్వతంత్రంగా ఉండాలి అని కోరుకుంటున్నాం.

ద్వేషం ఎందుకు ఉండకూడదు? ద్వేషం పెరుగుతూ ఉంటే మనసు పెరుగుతుంది. పగ పెరుగుతూ ఉంటే మనసు పెరుగుతుంది. మనసు పెరుగుతుంటే మీకు దుఃఖం తీసుకు వస్తుంది. మనసుని జయించడానికి, ఎన్ని మంత్రాలు, ఎన్ని యంత్రాలు, ఎన్ని తంత్రాలు, ఎన్ని మతాలు. మీరు నాకు చెడ్డ చేస్తున్నారు అనుకోండి. మీరు నాకు చెడ్డ చేసేస్తున్నారు అని మీరు అనుకుంటున్నారు. కాని మీ నెత్తిమీద నిప్పులు వేసుకుంటున్నారు అన్న సంగతి మీకు తెలియదు. మీకు అనిపించవచ్చు ఎదుటి వాడికి చెడ్డ చేసేస్తుంటే వాడు ఏమి మాట్లాడటం లేదు అని, కాని మీ నెత్తిమీద మీరు నిప్పులు వేసుకుంటున్నారు. మీరు నాకు ఉపకారం చేస్తే మీకు మీరే ఉపకారం చేసుకున్నట్టు. మీరు నాకు అపకారం చేస్తే మీకు మీరు అపకారం చేసుకున్నట్టు.

ఎన్ని గ్రంధాలు మీరు చదవండి. ఎంతమంది మహాత్ములు చెప్పింది వినండి, మనస్సుని నిగ్రహించుకోమనే చెబుతారు. అన్ని పుస్తకాలలో మనస్సుని నిగ్రహించుకోమని చెబుతుంటే, నా మనస్సుని నిగ్రహించుకోవడం మానేసి పుస్తకాలు చదవటం పని కింద పెట్టుకుంటే ఇంక మనస్సు స్వాధీనంలోనికి వస్తుందా? అది కాదండి మీరు భగవద్గీత చదివారు. మనస్సుని నిగ్రహించుకోమని చెప్పింది, మనస్సుని నిగ్రహించుకోవడం మానేసి అస్తమాను భగవద్గీత చదివితే మీ మనస్సు నిగ్రహంలోకి వస్తుందా? మీ మనస్సు లోపల ఉందా? భగవద్గీతలో ఉందా? పుస్తకంలో ఫలానా రోగానికి ఈ బిళ్ళ వేసుకుంటే తగ్గుతుంది అని ఉంది. పుస్తకంలో ఉన్న మాట నిజమే! కాని మీరు బిళ్ళ మింగరు. మింగకుండా ఈ బిళ్ళకు రోగం తగ్గును అని పుస్తకంలో ఉన్నది చదువుతూ ఉంటారు. తగ్గుతుందా రోగం? బిళ్ళ మింగితే కదా! ఎన్ని పుస్తకాలు చదివినా ఏమి చెప్పారు? మనస్సును నిగ్రహించుకోమనే కదా చెబుతా, మనస్సుని నిగ్రహించుకోవడం మానేసి పుస్తకాలు చదువుతూ ఉంటే ఏమిటి ప్రయోజనం? చదివితే పుస్తకాలు ఏమి చేస్తాయి? పుస్తకాలు చదివితే ఏదో ఒక ఉద్యోగం చేసుకోవచ్చు. దాని ప్రయోజనం లేదు అని చెప్పటం లేదు. ఏదో పొట్ట వెళ్ళిపోతుంది. మనస్సు మాట ఏమిటి అని, పుస్తకాలు చదవటం వలన మనస్సుని నిగ్రహించే శక్తి వస్తే, ఈ


పాటికి పండితులు అందరూ కూడా జ్ఞానులు అయిపోవాలి.

పుణ్యక్షేత్రాలు దర్శించడం ఎటువంటిదో అంతకంటే ఎక్కువ మహాత్ములను దర్శించటం. తీర్థయాత్రల వల్ల కూడా మీ మనస్సు నిగ్రహింపబడకపోవచ్చు కానీ మహాత్ముల దర్శనం వల్ల మనస్సు నిగ్రహింపబడుతుంది. అంటే తీర్థ యాత్రల కంటే కూడా ఎక్కువ మహాత్ముల యొక్క సందర్శనం. కొందరు భగవాన్‌ని తిట్టేసి వెళ్ళిపోయేవారు. పది రోజులు తరువాత వారికి బాధ అనిపించేది. అప్పుడు వచ్చి స్వామి నిన్ను పొరపాటున మేముతిట్టేశాము. మీరు మనస్సులో ఏమి పెట్టుకోవద్దు అనేవారు భగవాన్‌తో. అప్పుడు భగవాన్ అనేవారు. నాకు మనస్సు ఉంటే మనస్సులో పెట్టుకుంటాను. మనస్సు లేదే? మరి ఎక్కడ పెట్టుకుంటాను? నాలుక మరీ ప్రమాదం. మన శరీరంలో అన్ని ఇంద్రియాలు ఒక్కొక్క పని చేస్తుంటే నాలుక మాత్రం రెండు పనులు చేస్తుంది. ఒకటి మాటలు మాట్లాడుతుంది, రెండు రుచిని చూస్తుంది. గాంధీగారు ఏమన్నారు అంటే నాలుకను జయించవయ్యా ముందు, మిగతావన్నీ జయించినట్టే అన్నారు. నాలుకను కనుక జయిస్తే మిగతా ఇంద్రియాలు అన్నీ స్వాధీనంలోకి వచ్చేస్తాయి అన్నారు. మనం మాటల కాడ నిగ్రహంగా మాట్లాడితే అసలు గొడవలే రావు. చాలామంది కంగారుగా మాట్లాడి గొడవలు తెచ్చుకుంటారు. చాలామంది ఏమి చేస్తారు అంటే మాట్లాడిన తరువాత ఆలోచిస్తారు. అలా కాదు ఆలోచించిన తరువాత మాట్లాడటం నేర్చుకోవాలి.


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక **శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**, అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0916137)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.



# అరుణాచల మహాత్మ్యం అక్షరమణమాల

**సేకరణ: రాజేశ్వరి గారు, హైదరాబాదు**

**లాభమీ విహపర లాభహీనుని జేరి**
**లాభమేమి అందితివి అరుణాచలా ॥93॥**

తాత్పర్యము: ఈ లోకానికి కానీ, పరలోకానికి కానీ పనికిరాని ఈ లాభహీనుడిని పొంది, నీవేమి లాభం పొందావు అరుణాచలా!

ఈ లోకం గురించి రెండే రెండు మాటలు చెప్పాడు భగవంతుడు వాసుదేవుడు. ఒకటి అనిత్యం రెండు అసుఖం. ఈ లోకంలో ఏది నీకు నిత్యంగా ఉండదు, ఎందులోనూ సుఖం లేదు. ఈ లోకంలో కాని పరలోకంలో కాని ఎక్కడా నీకు సుఖం లేదు, ఇది అనిత్యం, అసుఖం. సుఖం నీ హృదయంలో ఉంది, ఆత్మలో ఉంది. మీరే సుఖం మీ పేరే సుఖం. సుఖం కోసం బయట వెతకకండి. ఈ లోకంలో కాని, పరలోకంలో కాని సుఖాన్వేషణ చేయకండి. అది మీ హృదయంలోనే ఉంది అది ఇప్పుడే తెలుసుకోండి. ఇక్కడే తెలుసుకోండి. ఆ సుఖాన్ని మీరు చూసిన తరువాత అదే లాభం. ఆ లాభం మీరు పొందిన తరువాత ఇంకో లాభం మీకు పొందాలని అనిపించదు. అదే ఐశ్వర్యం, అదే ఆరోగ్యం దానికి మించిన ఐశ్వర్యం కాని దానికి మించిన లాభం కాని దానికి మించిన ఉన్నత వస్తువు కాని దానికి మించిన స్థితి కాని ఈ లోకంలో కాని పరలోకంలో కాని ఏమి లేదు. దేవుడు కంటే మించిన లాభం ఈ లోకంలో ఉందా? మనం ధనం, గౌరవం, కీర్తి, అధికారం, ఇవన్నీ లాభం అనుకోవచ్చు. ఎవరి మనసులో ఉన్న దాన్ని బట్టి ఎవరి అంచనాలు వారు కట్టుకోవచ్చు. కాని భగవంతుడు ఒక్కడే లాభం.

అందుకే అరుణాచలేశ్వరుడితో రమణస్వామి చెబుతున్నాడు. లాభమీ విహపర లాభ హీనుని చేరి - ఓ అరుణాచలేశ్వరుడా నువ్వే నాకు లాభం. లోకానికి అంతా నువ్వే లాభం, నువ్వే సంపాదన. నిన్ను సంపాదించిన తరువాత నాకు ఇంక సంపాదించ వలసింది అంటూ ఏమి మిగలలేదు. అయితే దేవుడిని పొందితేనే లాభం పొందుతాను అనే భావన, అనే తలంపు, జీవుల్లో ఎవరికీ లేదు. లోకానికి సంబంధించినవి ఏవో లాభాలు అనుకుంటూ ఉంటాం కాని అరుణాచలేశ్వరుడే నిజమైన లాభం. అరుణాచలేశ్వరుడు తిరువన్నామలైలో ఉన్నాడు అనుకోకండి, ఇప్పుడే మీ హృదయంలో ఉన్నాడు. వాడిని పొందండి. మీరు ఎంత లాభాన్ని పొందారో, ఎంత ఐశ్వర్యాన్ని మీరు పొందారో, వాడిని పొందిన తరువాత మీకు తెలుస్తుంది.

లాభమీ విహపర లాభ హీనుని చేరి - ఈ లోకంలో ఏమి లేదు అట ఈ రమణ మహర్షి అనే పెళ్ళి కూతురికి, పరలోకంలో ఏమైనా ఉంది అంటే పరలోకంలో ఏమి లేదు అట. మరి నన్ను ఎందుకు తీసుకున్నావు? నన్ను హృదయంలోకి ఎందుకు లాక్కున్నావు. నాకేమి లాభం ఉంది? నాకేమి సంపద ఉంది? నాకు ఏమి ఐశ్వర్యం ఉంది? నన్ను చేర్చుకోవడం వల్ల నన్ను తీసుకోవడం వల్ల నీకుఅదనంగా ఏమైనా లాభం వస్తుంది అని తీసుకున్నావా? నువ్వే లాభానివి. నాకేమీ ఆస్తులు, ఐశ్వర్యాలు, గౌరవాలు లేవే, మరి నన్ను ఎందుకు తీసుకున్నావు అరుణాచలేశ్వరుడా, అంటున్నాడు రమణస్వామి.

మీరు అందరూ పూజ ఎందుకు చేస్తున్నారు? పరలోకంలో మనం సుఖాలు, భోగాలు పొందొచ్చు, విష్ణువు మనలని చూసి సంతోషిస్తాడు, బహుమతులు ఇస్తాడు అని. లేకపోతే మీరు పూజ చేస్తారా, జపం చేస్తారా? పరలోకంలో గొప్ప గౌరవాలు సుఖాలు పొందొచ్చు అని మీరు పూజలు, యజ్ఞాలు, దానాలు, ధర్మాలు చేస్తున్నారు. ఈ రమణ మహర్షి అనే పెళ్ళి కూతురికి ఏమైనా పుణ్యం ఉందా మరి, పుణ్యం ఉంటే లాభాలు పొందుతాడు పరలోకంలో, ఆయనకు పుణ్యం లేదు, పాపం లేదు, పుణ్యం పాపం లేనటువంటి నేను ఏమి లాభం పొందుతాను. ఈ లోకంలో ఏమైనా గొప్ప గొప్పవి సాధించానా అంటే అదీ లేదు. పుణ్యం చేసుకున్నాను కనుక మరణించాక అక్కడ ఏదోకటి పొందుతాను అంటే అదీ కనిపించటం లేదు. ఇటువంటి నన్ను తీసుకుని నువ్వు ఏమి లాభం పొందుతావు? ఏమి సంపాదిస్తావు? నాలోని ఈ సున్నని నువ్వు తీసుకుంటావా అరుణాచలేశ్వరుడా?

రమణమహర్షి గారు చెప్పేది ఏమిటి అంటే, నేను లాభహీనుడని. ఈ లోకంలో కాని, పరలోకంలో కాని నాకేమి లాభం లేదు. అంటే కర్తృత్వం పెట్టుకుని, అహంకారం పెట్టుకుని, మనసుని పెట్టుకుని, మనం ఎన్నో సాధనలు చేస్తాం ఈ లోకంలో సుఖ పడాలి అని, పుణ్యం అంతా సంపాదించి పరలోకంలోకి పట్టుకు వెళ్ళాలి అని, అక్కడ కూడా ఈ భోగాలు అనుభవించాలి అని ఇటువంటి కర్తృత్వ బుద్ధి తోటి, అహంకారం తోటి, జీవ లక్షణాల తోటి మనం ఏ పని అయినా చేస్తాం. అందుచేత ఇలా కర్తృత్వం తోటి పనులు చేసి పోగొట్టుకోవడానికి రమణస్వామికి ఏమి లేదు. దేహ బుద్ధి తోటి ఆయన చేసిన పని లేదు. అందుచేత నేను నాది లేని వాడిని నేను, ఈ నేను నాది లేనివాడిని నన్ను తీసుకుని నువ్వు ఏమి లాభం పొందుతావు అరుణాచలేశ్వరుడా. ఓ అరుణాచలేశ్వరుడా నువ్వు లాభానివే అయితే నన్ను తీసుకోవడం వల్ల నీకు వచ్చే అదనపు లాభం లేదు. ఈ లోకంలో కాని పరలోకంలో కాని నాకేమి లాభం లేదు. నాకేమి ఐశ్వర్యం లేదు, నన్ను నీ హృదయంలోకి తీసుకుని, నన్ను నీ వాడిని చేసుకుని నువ్వు ఏమి లాభం పొందుతావు అరుణాచలేశ్వరుడా.

ఈ లాభం-నష్టం, రాగం-ద్వేషం, సుఖం-దుఃఖం ఇవన్నీ మనస్సు యొక్క పరిధిలోనివే. మనస్సు దాటిన తరువాత ఏమి లేదు. అహంకారం లేని వాడికి ఏమి ఉంటుంది అండి, ఉన్నది ఆత్మ స్వరూపమే. రమణమహర్షి యొక్క నిరహంకార స్థితి, నిగర్వ స్థితి, లోతులు చెప్పటం కోసం నేను ఇహపర లాభ హీనున్ని అని చెప్పాడు.



# శ్రీమద్భగవద్గీత

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)**

**- సేకరణ : బేబీ, హైదరాబాద్**

**అపూర్వమాణమచల ప్రతిష్టం సముద్రమాపః ప్రవిశంతి యద్వత్ ।**
**తద్వత్ కామా యం ప్రవిశంతి సర్వే స శాంతి మాప్నోతి న కామకామీ ॥ 2-70 ॥**

**తాత్పర్యము:** సమస్త దిశల నుండి పొంగి ప్రవహించుచు వచ్చి చేరిన నదులన్నియును పరిపూర్ణమై నిశ్చలముగానున్న సముద్రమును ఏమాత్రము చలింపజేయకుండగనే అందులో లీనమగును. అట్లే సమస్త భోగములును స్థితప్రజ్ఞుని యందు ఎట్టి వికారములను కలిగింపకయే వానిలో లీనమగును. అట్టి పురుషుడే పరమశాంతిని పొందును. భోగాసక్తుడు శాంతిని పొందజాలడు.

స్థితప్రజ్ఞుడు ఎలాగ ఉంటాడు అంటే సముద్రంలాగ లోతుగా, విశాలంగా, నిండుగా ఉంటాడు. చలనం లేకుండా ఉంటాడు. వర్షాకాలంలో నదులు వెళ్ళి సముద్రంలో కలుస్తాయి. సముద్రం ఏమీ కదలదు మెదలదు. వేసవికాలంలో నదులలో నీళ్ళు ఎండిపోతాయి. నదులు రావటం మానేస్తే ఒక్క అంగుళం కూడా సముద్రం తగ్గదు. వర్షాకాలంలో నదులు వరదలుగా వచ్చినప్పుడు సంతోషం లేదు,నదులు రాలేదని బెంగలేదు. లోపల వికారం లేదు. స్థితప్రజ్ఞుడు ఇలా ఉంటాడు అని చెపుతున్నారు. నదులు వెళ్ళి కలిసినప్పుడు సముద్రానికి పొంగు లేదు, నదులు రావటం మానేస్తే దానికి దుఖం లేదు. అలాగే స్థితప్రజ్ఞుడికి ఏదైనా వచ్చినప్పుడు ఏమీ అనిపించదు, రానప్పుడు ఏమీ అనిపించదు, ఎందుచేత అంటే వాడు సముద్రంలాగ ఉంటాడు. మనం ఏదైనా వచ్చినప్పుడు వచ్చింది అనుకుంటాము, పోయినప్పుడు ఏదో పోయింది అనుకుంటాము. ఏదీ రావటం లేదు పోవటం లేదు, మీ మనస్సుకి అలా అనిపిస్తుంది, అదే మాయ.

నువ్వు దేహం కాదు, చైతన్య స్వరూపుడవు. నువ్వు పుట్టుక లేని వాడవు, చావు లేని వాడవు, నువ్వు అమృత స్వరూపుడవు. నీకు వచ్చేది లేదు, పోయేది లేదు. సముద్రానికి నీళ్ళు వచ్చినా, నీళ్ళు రావటం ఆగిపోయినా దానికి ఏమీ అనిపించదు. స్థితప్రజ్ఞుడికి ఎదుటివాడు గౌరవించినా ఏమీ అనిపించదు. ఒకవేళ గౌరవించటం మానేసినా వాడికి ఎర్రచీమ కుట్టినట్టు కూడా ఉండదు. ఎందుచేతనంటే వాడు దేహమాత్రుడు కాదు. కృష్ణుడికి మనకి తేడా ఏమిటి అంటే వాడు దేహంతో ఉన్నా, ఈ దేహానికి మనకి సంబంధం లేదు అని వాడికి తెలుస్తూ ఉంటుంది. మనం దేహంతో ఉన్నప్పుడు ఈ దేహమే మనం అనుకుంటాము. ఇది జీవలక్షణం, అది దైవలక్షణం.

సముద్రానికి చలనం లేదు, నిండుగా ఉంటుంది. సముద్రమాపః అంటే కృష్ణుడు ఇక్కడ జ్ఞానిని సముద్రంతోటి పోల్చాడు. పూరీలో సముద్రాన్ని మహోదధి అంటారు. రమణమహర్షి గారు కృతిమహోదధౌ అని చెప్పారు. భగవాన్ చెప్పింది ఉప్పు సముద్రం కాదు, కర్మ సముద్రం. అంటే నువ్వు ఏదో పని చేస్తావు. ఆ పని స్వార్థం తోటి చేస్తావు. సత్కర్మ నిష్కామంగా చేసేవాళ్ళు తక్కువ మంది ఉంటారు. అలా చెయ్యగలిగితే వాళ్ళకి ఆత్మజ్ఞానం కలుగుతుంది. నిష్కామంగా చెయ్యము కాబట్టి ప్రతీ మనిషి కర్మసముద్రంలో పడుతున్నాడు అన్నారు భగవాన్. నువ్వు పని దేహబుద్ధితోటి ఫలితం ఆశించి చేస్తావు. ఆ పని కలిసివస్తే సంతోషం వస్తుంది. కలిసిరాకపోతే దుఖం వస్తుంది. కలిసివస్తే ఆ ఫలితాన్ని అనుభవిస్తావు, అనుభవిస్తే అది మళ్ళీ కావాలి అనిపిస్తుంది. మీరు ఈ రోజు ఏదైనా తిన్నారనుకోండి, అది బాగుంటే నాలుగు రోజుల తరువాత మళ్ళీ అది తినాలి అనిపిస్తుంది. ఎందుచేత అంటే అది చాలా బాగుంది అనే వాసన మీ మనస్సులో పడిపోతుంది. మళ్ళీ దానిని ఎలా సంపాదించాలి అని దాని కోసం ప్రయత్నం చేస్తాము. అంటే మీరు ఏ విషయం అనుభవించినా ఆ వస్తువు పోతుంది (మామిడిపండు తినటం అయిపోతుంది) ఆ వాసన ఏంచేస్తుంది అంటే, మళ్ళీ దానిని ఎలా సంపాదించాలి అనిపిస్తుంది. మీకు ఇప్పుడు డబ్బు బాగా ఉందనుకోండి, భోగం అనుభవిస్తారు. ఆ డబ్బు ఏ కారణం వల్ల అయినా పోయింది అనుకోండి, పోతే పోయింది మళ్ళీ మనం బాగా డబ్బు సంపాదించాలి అనుకుంటారు. ఎందుచేత అంటే, ఇదివరకు డబ్బు ఉన్నప్పుడు మీరు భోగం అనుభవించారు కాబట్టి మళ్ళీ డబ్బు సంపాదించాలి అని మీకు అనిపిస్తుంది. ఆ భోగాన్ని అనుభవించినప్పుడు, అది వాసన కింద పడుతుంది. ఆ వాసన మళ్ళీ మీచేత పని చేయిస్తుంది. పని చేస్తే మళ్ళీ ఫలితం వస్తుంది. ఆ ఫలితాన్ని మళ్ళీ మీరు అనుభవిస్తారు. మళ్ళీ వాసన కింద పడుతుంది. ఇది కర్మ సముద్రం. మీరు సంపాదిస్తారు, అనుభవిస్తారు, అది వాసన కింద పడుతుంది, మళ్ళీ

సంపాదిస్తారు అనుభవిస్తారు. అయితే ఇక్కడ ప్రమాదం ఏమిటంటే, పని చేసుకోవటం, సంపాదించటం, అనుభవించటం, ఇది ఏమౌతుంది అంటే, చివరికి మైండు భగవంతుడి వైపుకి కానీ మోక్షం వైపుకి కానీ తిరగదు. మనం వయస్సులో ఉన్నప్పుడు ఒక మంచి పని అయినా చేయలేదు, భగవంతుడిని ప్రార్థించుకోలేదు. ఇప్పుడు ముసలితనం వచ్చింది. ఇప్పుడైనా కొన్ని మంచిపనులు చేద్దాము. మోక్షం పొందటానికి సాధన చేసుకొందాము అనే బుద్ధి కలగటంలేదు. మీరు కర్మ ఫలితాలు అనుభవించి ఉన్నారు కదా. ఆ కర్మ ఫలితాలు ఎప్పుడైతే మీరు అనుభవిస్తున్నారో అప్పుడు ఏమౌతుంది అంటే మీ మనస్సుని భగవంతుడి వైపుకి కాని, గమ్యం వైపుకి కాని, మోక్షం పొందుదాము అనే సాధన వైపుకి కాని మీ వాసన వెళ్లనివ్వదు. ఈ కర్మ సముద్రంలోంచి ఒడ్డుకి వచ్చి మీరు మోక్షానికి వెళ్లలేరు. అదే కృతి మహోదధౌ.

ఇక్కడ సముద్రం తోటి జ్ఞానిని ఎందుకు పోల్చుతున్నాడు అంటే, కెరటాలు ఉన్నా సముద్రం సముద్రమే, కెరటాలు లేకపోయినా సముద్రం సముద్రమే. అలాగే నువ్వు పని చేస్తున్నా, ప్రశాంతముగా ఉన్నా, నువ్వు ఎప్పుడైతే సముద్రములా ఉన్నావో, శాంతి మధ్యలోనే ఉంటావు. జ్ఞానంలో ఊగిసలాడతావు. అప్పుడు మీకు కర్మ సముద్రం గొడవ అక్కరలేదు, సుఖసముద్రంలో ఊగిసలాడతారు. అది ఉప్పు సముద్రం కాదు, పాల సముద్రం కాదు, సుఖ సముద్రంలో ఊగిసలాడతారు.

సైన్సు అభివృద్ధి అయ్యేకొలదీ, టెక్నాలజి అభివృద్ధి అయ్యేకొలదీ, శరీరాలు సుఖపడుతున్నాయి కాని మనస్సు బాగుపడటం లేదు. మీకు డబ్బు అంగబలం ఉన్నంతమాత్రం చేత మీ మనస్సులు మంచివి అని చెప్పలేము కదా. పూర్వం రెండెడ్ల బండి మీద తిరుగుతూ ఉంటే, ఇప్పుడు విమానాల మీద తిరుగుతున్నారు. టెక్నాలజి అభివృద్ధిలోకి వచ్చింది అయితే మీకు ఏమైనా మనోనిగ్రహం ఉందా? మీ మనస్సు నిర్మలంగా ఉందా, సముద్రంలాగా విశాలంగా ఉందా? సైన్సు మీ శరీరాన్ని సుఖపెడుతుంది కాని మనస్సుని బాగు చేయటం లేదు అని కాటన్ దొర చెప్పాడు.

వేసవి కాలం అయినా, వర్షాకాలం అయినా సముద్రం ఎలాగ సమానంగా ఉంటుందో, నీకు కోరికలు నెరవేరినా, కోరికలు నెరవేరకపోయినా, అలా సమానంగా ఉంటే నువ్వు శాంతిని పొందుతావు, కానీ కాముకుడు శాంతిని పొందలేడు అని ఈ శ్లోకానికి అర్థం. కనిపించేదంతా నాకే కావాలి అనుకొనేవాడు శాంతిని పొందలేడు. సముద్రంలాగ ఉన్న మనిషి కోరికలు నెరవేరినా నెరవేరక పోయినా శాంతిగానే ఉంటాడు. కాని ఎవడైతే సముద్రంలాగ ఉండడో వాడు కోరికలు నెరవేరకపోతే దుఃఖపడతాడు. ఇది ఈ శ్లోకానికి అర్థం.

శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

SRI RAMANA KSHETRAM A/c. No. 6794857762
**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**
IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

# చిత్తశుద్ధి

బంగారము వన్నె ఒరిపిడిరాయి నిరూపణ చేయు విధముగా, శుద్ధమనస్సు అనగా చిత్తశుద్ధి అనే ద్వారం గుండానే మోక్షంలోకి ప్రవేశిస్తాం! పరిశుద్ధమైన అంతఃకరణను సాధించడానికి మనకు శ్రద్ధ, వివేకముతో కూడిన సాధన అవసరం అవుతుంది. మలిన మనస్సుకి స్వరూపానుభవం కలగదు, కాబట్టి విషయచింతనను తగ్గించుకోవాలి. అందరిలోనూ అంతర్యామిగా పరమాత్మ ఉన్నాడు కాబట్టి, అందరినీ అనగా సకలమును ప్రేమించే అభ్యాసం చెయ్యాలి. మనలోని వికారాలను, ప్రేమతత్వంగా పరివర్తన చేసుకోవాలి. గురుబోధను కేవలం శ్రవణానికే పరిమితం చెయ్యకుండా, దానిని ఆచరించినప్పుడే సఫలత చేకూరుతుంది. ధర్మసూత్రాలను ఆచరించాలి. దేహ పోషణకు నియమితమైన వేళల్లో రెండుపూటలా ఆహారాన్ని తీసుకున్నట్లే, మనస్సుకు చక్కటి ఆధ్యాత్మిక ఆహారాన్ని అందివ్వాలి. సత్సంగములు, గురుబోధ మననము ద్వారా మనస్సుకు సత్ప్రవర్తనను, జ్ఞానాన్ని, తాత్త్విక చింతనను, ఆహారంగా అందించాలి. సజ్జన సాంగత్యము చేస్తూ, శాస్త్రాన్ని, గురువాక్యాన్ని ప్రమాణంగా పెట్టుకొని, అహంకార రహితంగా జీవిస్తే, ఆత్మజ్ఞానం కలుగుతుంది. పాండిత్యం, ధనం, కీర్తి, అధికారం సంపాదించడం కంటే, మారుమనస్సు పొందడం చాలా కష్టం. గురువాక్యం మన మనస్సుమీద పనిచెయ్యాలంటే, గురువుపట్ల సజీవవిశ్వాసం ఉండాలి. ప్రతిజీవిలోనూ పరమాత్మను చూడడం నేర్చుకుంటే, మనస్సు పవిత్రమవుతుంది, అదే చిత్తశుద్ధి! చిత్తశుద్ధి ద్వారా స్వరూపానికి చేరువ అవుతాం! విషయపరిజ్ఞానం ఎక్కువ అయితే, స్వరూపానికి దూరం అవుతాం! వస్తువుల నుండి, బయటనుండి, ఆనందం వస్తుందని భ్రమపడుతున్నాం. ఆనందం మన స్వరూపం గానే ఉంది. జీవితం ఆనందమయం కావాలంటే, ఆత్మజ్ఞానమే శరణ్యం! మన స్వరూపమే ఆత్మ!

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# మాయ తలుపు తట్టింది - ప్రేమ తలుపు తీస్తే అక్కడ ఎవరూ లేరు

వైశాలి నగరం (ఇప్పటి పాట్నా) లో అమ్రపాలి అనే గొప్ప స్ఫురద్రూపి అయిన వేశ్య ఉండేది. దేశంలో ఎందరో రాజులు, చక్రవర్తులను తన అందంతో వశం చేసుకొని పాదాక్రాంతం చేసుకొంది. వారు ఇచ్చే బంగారంతో బంగారు కోటను, బంగారు భవ్యమైన భవంతిని నిర్మించుకొని అంతులేని మణిమాణిక్యాలు, ధనంతో విరాజిల్లుతోంది. ఆమెలో ఒక దుర్బుద్ధి ప్రవేశించింది ఇలా "బుద్ధుడు అందగాడు, తేజోవంతుడైన చక్రవర్తి రాకుమారుడు అని ఆయన్ని వశం చేసుకోవాలనే అహంభావనతో మోహంతో" బుద్ధుడు ఒక ఆలయంలో విడిది చేసాడని తెలిసి ఆరోజు పున్నమిరాత్రి తన దేహాన్ని మనోహరంగా మణులతో కూడిన బంగారు ఆభరణాలతో, పట్టువస్త్రాలతో అలంకరించుకొని బంగారు పళ్ళెంలో సుగంధ ద్రవ్యాలతో రుచికరమైన వంటకాలతో దేవాలయం తలుపు తట్టింది. సర్వాంతర్యామి అయిన బుద్ధభగవానుడు తలుపు తీయగా 'బుద్ధుని ముఖవైభవం, అతనిలోని ప్రశాంతత' చూసి నిర్ఘాంతపోగా బుద్ధ భగవానుడు ఆమెతో "అమ్మా నీ బిడ్డను ఏమి ఆదేశించటానికి వచ్చావు?" తెలుపమని కోరగా ఆమె చేతులు వణికాయి. పళ్ళెము, వాటిలో ఉన్న పదార్థాలు నేలపై పడిపోయాయి. అపరాధభావంతో తిరిగి వెనుకకు మరలుతూ ఉంటే తిరిగి బుద్ధభగవానుడు ఆమెతో "అమ్మా! నీకు తగిన సమయం వచ్చినప్పుడు తప్పక సహాయం చేస్తాను" అన్నాడు. పది సంవత్సరాల కాలంలో బంగారు కోట, భవనం, ధనం అంతా వారసుల పాలైనది. ఆమె బికారిగా మారింది. కుష్ఠు వ్యాధి శరీరం అంతా వ్యాపించి పుళ్ళతో రసికారుతూ ఉంటే ఆమెకే రోత కలిగింది. పట్నం ప్రజలు తనకున్న కుష్ఠు వ్యాధిని ప్రజలందరికీ అంటిస్తుందని పట్నం బయటకు గెంటేసారు. ఆ సమయం శీతాకాలం అర్ధనగ్నంగా చెట్టు క్రింద కూర్చున్నది. శరీరం చలికి వణుకుతూ ఉంది. ఐదు నిమిషాల్లో ప్రాణం పోతుందనగా దయాసింధు, కృపాసింధుడైన బుద్ధభగవానులవారు అటుగా వచ్చి తన శాలువాను ఆమెపైన కప్పారు. కుష్ఠువ్యాధి బుద్ధుని స్పర్శతో మటుమాయమైనది. అప్పుడు ఆమె బుద్ధునితో "తండ్రీ! మీ మాటను ఇప్పుడు నెరవేర్చుకున్నారా?" అని అంటుంది. ఆమె ఇలా అనుకొంది మోహమే మాయ అని దైవప్రేమే నిత్య సత్యమని గ్రహించింది. తదనంతర కాలంలో బుద్ధుని శిష్యురాలుగా ఎంతో పరిణతి చెందింది. బుద్ధభగవాన్ సాన్నిధ్యంతో ఆయన శిష్యురాలిగా గణుతికెక్కి అంతిమకాలంలో నిర్వాణ సుఖం పొందింది. బుద్ధుని దయ విశ్వవ్యాప్త మైనది. శ్రీరమణభగవాన్ దర్శించిన ఒక వేశ్య ఆ పడుపువృత్తిని మానింది. తన పిల్లలకు వివాహం చేసి తను పవిత్రంగా మారింది. ఏసు మేరీమేగ్డలిన్‌ని పవిత్రం చేసాడు. మహాత్ముల దర్శనం వారి పాప పంకిలమైన జీవితాన్ని పవిత్రులుగా, పావనులుగా తీర్చి దిద్దుతుంది. ఇది చరిత్రలో కోకొల్లలు. శ్రీనాన్నగారు "మహాత్ములు మాయను మాయ చెయ్యగలరు, వారి దర్శనంతో తిరిగి మాయలో పడలేరు. అక్కడ ఎవ్వరూ మాయతో నిలవలేరు" అన్నారు.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం, సెల్ : 9491968966